ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
శనివారం 22 నవంబరు 2025

గండి క్షేత్రంలో హుండీల లెక్కింపు చేస్తున్న దృశ్యం



గండి అంజన్నకు రూ.25లక్షల ఆదాయం

చక్రాయపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో శుక్రవారం నిర్వహించిన హుండీల లెక్కింపుతో రూ.25లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. 84 రోజులకు గాను ఏడు శాశ్వత హుండీలను తెరిచి లెక్కింపు సాగించామన్నారు. హుండీల ద్వారా రూ.25,07,015, అన్నదానం హుండీ ద్వారా రూ.66,247 వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవదాయ ధర్మదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రమణమ్మ, ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మత్స్య దినోత్సవం

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని మత్స్యశాఖ కార్యాలయంలో శుక్రవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మత్స్యశాఖ డీడీ కె.నాగయ్య మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మత్స్యకారులకు వివిధ రకాల పథకాలు అమలు చేస్తున్నామన్నారు. అదే విధంగా ప్రపంచ మత్స్యదినోత్సవ ఆవశ్యకతపై వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర బెస్త కార్పొరేషన్ డైరెక్టరు ఎం.వెంకటసుబ్బయ్య, ఉమ్మడి కడప జిల్లా మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు వై.రాంప్రసాద్, డైరెక్టర్లు సునీల్‌కుమార్, ఆర్.బాలరాజు, మత్స్య అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మత్స్యశాఖ డీడీ నాగయ్య

ఎంవోయూ పత్రాలతో ఏపీ కార్ల్ ప్రతినిధులు, కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



ఏపీ కార్ల్‌లో భారీ పెట్టుబడులు

కడప కలెక్టరేట్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఏపీ కార్ల్‌కి భారీ పెట్టుబడులు రానున్నాయి. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తన చాంబర్‌లో మ్యాక్స్‌వెల్ బయో సైన్సెస్ అమెరికా వారి అనుబంధ సంస్థ హెవిహ ప్రతినిధి డాక్టర్ చేతన్ టమహంకార్‌తో పులివెందుల నియోజకవర్గంలోని ఏపీ కార్ల్ తరుపున చీఫ్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసరు శ్రీనివాసప్రసాద్ ఎంవోయూలు కుదుర్చుకున్నారు. ఇందులో భాగంగా రానున్న 6 నెలల్లో రూ.30 కోట్ల పెట్టుబడితో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ల్యాబ్ ఏర్పాటు చేయనున్నారు. దాదాపు 50 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. దశల వారీగా మరో నాలుగేళ్లలో రూ.2వేల కోట్ల పెట్టుబడులతో మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ నిర్మాణానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అపార వనరులున్నాయని, పెట్టుబడుదారులకు అనుకూల ప్రాంతమన్నారు. మ్యాక్స్‌వెల్ బయో సైన్సెస్ అమెరికా వారి అనుబంధ సంస్థ హెవిమా, ఏపీ కార్ల్ వారితో ఒప్పందం కుదుర్చుకుందన్నారు. ప్రభుత్వపరంగా కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ కార్ల్ శాస్త్రవేత్త డాక్టర్ శివ ప్రసాద్, అడ్మిన్ లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

రెచ్చగొట్టే విధానాలు మానుకోండి

- వైసీపీ నేతలకు బీటెక్ రవి హెచ్చరిక



పులివెందుల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రెచ్చగొట్టే విధానాలు మానుకోవాలని.. లేదంటే తీవ్ర పరిణామాలు చవిచూడాల్సి వస్తుందని పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి వైసీపీ నేతలను హెచ్చరించారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పులివెందులను విమర్శించడం ఎందుకని వైసీపీ వారు ప్రశ్నిస్తున్నారన్నారు. వివేకానందరెడ్డి హత్యకు గురి అయిన సమయంలో తనను, ఆదిని కేసులో ఇరికించేందుకు తీవ్ర ప్రయత్నాలు సాగాయన్నారు. ఆ సందర్భంలో ఆదినారాయణరెడ్డి కడప ఎంపీ స్థానానికి పోటీ చేసి ఓడిపోయారన్నారు. వివేకానందరెడ్డి కేసులో ఎలాంటి సంబంధం లేకపోయినా వైసీపీ వారు విష ప్రచారం చేయడంతోనే ఆయనకు ఎన్నికల్లో నష్టం జరిగిందన్నారు. దీని కారణంగానే ఆయన వైఎస్ కుటుంబ సభ్యులపై విమర్శలు చేస్తున్నారన్నారు. పులివెందుల ప్రజలు సంయమనంగా ఉన్నారని, లేకుంటే వారి ఇంటికి వెళ్తారని ఎంపీ చెప్పడం హాస్యాస్పదమన్నారు. అలా వెళ్లాల్సి వస్తే ముందుగా దేవగుడి ఇంటికి కాదు బీటెక్ రవి ఇంటికి రావాలన్నారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డులు, ఏడు జడ్పీటీసీలు, అన్ని ఎంపీటీసీలు ఏకగ్రీవంగా గెలిచారంటే ఇక్కడ ప్రజాస్వామ్యం ఏవిధంగా ఉందో అందరికి తెలుసన్నారు. రెచ్చగొట్టే విధానాలు మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హజ్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాష, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మధుసూధన్‌రెడ్డి ఉన్నారు.

రూ.2.5లక్షల ఆర్థిక సాయం

కడప క్రైం,, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ బి.నారాయణ కుటుంబానికి ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ రూ.2.5 లక్షల ఆర్థిక సాయాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం అందించారు. పోలీసు సంక్షేమంలో భాగంగా పోలీసు వితరణ నిధి నుంచి ఈ మొత్తాన్ని అందించారు. దివంగత ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ సతీమణి బి.రమాదేవికి చెక్కు రూపంలో ఎస్పీ అందించారు. ఈ సందర్భంగా వారి యోగక్షేమాల గురించి ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. పోలీసుశాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏవో రమణ, డీపీవో బి సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌నాయక్, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్ పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ బి.నారాయణ కుటుంబానికి చెక్కు అందిస్తున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

పేదల బియ్యం.. పెద్దోళ్లకు..!

- బద్వేలు, పోరుమామిళ్ల మీదుగా.. తమిళనాడు, కర్ణాటకకు
- నిత్యం చౌక బియ్యం అక్రమ రవాణా


రేషన్ షాపు నుంచి అక్రమంగా తరలిస్తుండగా అధికారులు స్వాధీనం చేసుకున్న బియ్యం (ఫైల్‌ఫొటో)



బద్వేలు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పేదలకు ప్రభుత్వాలు చౌక ధరలకు అందజేస్తున్న బియ్యం పెద్దోళ్లకు నిత్యం అక్రమంగా తరలిపోతున్నాయి. అక్రమార్కులు బద్వేలు, పోరుమామిళ్ల కేంద్రంగా తమిళనాడు, కర్ణాటకకు యథేచ్ఛగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత పెద్దఎత్తున రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నా సంబంధిత శాఖాధికారులు స్పందించడం లేదు.

బద్వేలు, పోరుమామిళ్ల రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డాగా మారింది. ఇక్కడి నుంచి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారు. చౌకదుకాణాల నుంచి దళారులు చౌకగా కొనుగోలు చేసి బద్వేలు, పోరుమామిళ్లలో రహస్యంగా రైస్ మిల్లులలో నిల్వచేస్తారు. పాలిష్ చేసి వివిధ రకాల బ్రాండ్ సంచులకు నింపి గోడౌన్లకు చేరుస్తారు. అక్కడి నుంచి లారీల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించి లక్షలు సంపాదిస్తున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు వినవస్తున్నాయి. రాజకీయ నాయకుల అండ ఉండడంతో రేషన్ బియ్యం తరలిపోతోందని ప్రచారం సాగుతోంది. అప్పుడపుడు జిల్లా విజిలెన్స్ అధికారులు వచ్చి దాడులు చేసి బియ్యం పట్టుకోవడం తప్ప స్థానిక అధికారులు అడ్డుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ముఖ్యంగా పోరుమామిళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టి రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది.

ప్రత్యేక నిఘా ఉంచాం..

బియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాం. ఎవరైనా అక్రమంగా బియ్యం రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. రేషన్ షాపులో డీలర్లు, ప్రజా పంపిణీ వ్యవస్థ సక్రమంగా పని చేయలేదని ఎవరైనా ఫిర్యాదు చేస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటాం.

- ఉదయభాస్కర్ రాజు, తహశీల్దారు

లెక్కాజమ లేకుండా దోచుకున్నారు

- వేమన విగ్రహాన్ని రోడ్డుపై వేయడం దారుణం
- దొడ్డిదారిన ఎంప్లాయిమెంట్ పెంచారు
- 16 ఏళ్లుగా ఆడిట్ వివరాలు లేవు
- సవివరమైన నివేదిక అసెంబ్లీకి సమర్పిస్తాం
- ఏపీ లెజిస్లేటివ్ అసెంబ్లీ పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ చైర్మన్ కూన రవికుమార్


పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీ కమిటీ చైర్మన్ కూన రవికుమార్.. చిత్రంలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి తదితరులు

కడప కలెక్టరేట్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): "యోగివేమన యూనివర్శిటీ, వైఎస్సార్ ఫైన్ ఆర్ట్స్, పాడా, ఏపీ కార్ల్, ఏపీ జెన్‌కో, కడప స్టీల్, రాయలసీమ స్టీల్ అథారిటీ, టూరిజం తదితరాలను పరిశీలించాం. దొడ్డిదారిన ఉద్యోగాల నియమకాలు జరిగాయి. 16 ఏళ్లుగా ఆడిట్ అభ్యంతరాలు ఉన్నాయి. లెక్కాజమ లేకుండా దోపిడీ సాగింది. వీటన్నింపై ప్రభుత్వానికి, అసెంబ్లీకి సవివరంగా నివేదికలు సమర్పించి చర్యలకు సిఫార్సు చేయనున్నాం" అని ఏపీ లెజిస్లేటివ్ అసెంబ్లీ పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ చైర్మన్ కూన రవికుమార్ స్పష్టం చేశారు.
శుక్రవారం కలెక్టరేట్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పర్యటనలో భాగంగా గురువారం ఆర్టీపీపీని విజిట్ చేశామన్నారు. కంపెనీ పనితీరు విద్యుత్ ఉత్పత్తి, ఉద్యోగులు, రాబడిని పరిశీలించామన్నారు. వైవీయూ, వైఎస్సార్ ఆర్కిటెక్చర్ ఫైన్ ఆర్ట్స్, ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీ, రాయలసీమ, కడప స్టీల్ కార్పొరేషన్‌లపై సమీక్షించామన్నారు. ఈ రెండు స్టీల్ కార్పొరేషన్లు పనిచేయడం లేదన్నారు. పులివెందుల ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (పాడా) క్లోజ్ అయిందన్నారు. ఐదేళ్లుగా ఎంత బడ్జెట్ వచ్చింది? ఎంత ఖర్చుపెట్టారనే విషయంపై కమిటీ చర్చించిందన్నారు. అలాగే కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, కడప రీజియన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి, ఖర్చులు, రాబడి తదితరాలతో పాటు ఏపీ లైవ్ స్టాక్ రీసర్చ్, ఏపీ కార్ల్‌పై సమీక్షించామన్నారు.

వైవీయూలో అక్రమాలు

వైవీయూలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. చరిత్ర పురుషుడు యోగి వేమన విగ్రహాన్ని రోడ్డున పడేయడం దారుణమన్నారు. చరిత్రను కూడా కించపరచడం అంటే మన జాతిని మనం కించపరచడమే అని ఆవేదన వ్యక్తం చేశారు. వైవీయూలో 50 శాతం మాత్రమే అడ్మిషన్లు జరుగుతున్నాయని, అయితే ఉద్యోగుల నియామకాలు పెద్ద స్థాయిలో జరగడం చూస్తే అక్రమాలు జరిగినట్లు తెలుస్తోందన్నారు.

సమగ్ర వివరాలతో నివేదిక

పులివెందులలో టూరిజం, కార్పొరేషన్ డబ్బుతో ఒక ఎసెట్ కొనుగోలు చేశారన్నారు. ఆ వివరాలు పాడా, టూరిజం రికార్డుల్లో లేవన్నారు. ప్రతి కార్పొరేషన్, అథారిటీ, ఫైనాన్స్ అవకాశాలను పరిశీలించిందన్నారు. ప్రతి ఏటా ఆడిట్ చేయించి రిపోర్టులన్నీ అసెంబ్లీకి సమర్పించాలన్నారు. కానీ అలాంటి ప్రక్రియ 16 ఏళ్లుగా జరగలేదన్నారు. సమగ్ర వివరాలతో అసెంబ్లీకి, ప్రభుత్వానికీ నివేదికలు సమర్పిస్తామన్నారు. గత ప్రభుత్వం పరిపాలనలో విఫలమైందని విమర్శించారు. వాటిని గుర్తించి, సూచనలు చేశామన్నారు.

అంతకు ముందు కడప కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌హాలులో పీఏసీ కమిటీ సమావేశం కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆద్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో కమిటీ చైర్మన్‌తో పాటు కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, పామర్రు ఎమ్మెల్యే కుమార రాజా వర్ల, కాంట్రాక్టర్ ఇసాక్‌బాష, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, అసిస్టెంట్ సెక్రటరీ నాగమునెయ్య తదితరులతో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి ఏపీ లెజిస్లేటివ్ అసెంబ్లీ పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ(పీఏసీ) సలహాలు సహకారం ఎంతో అవసరమన్నారు.

బెట్టింగ్ నిర్వాహకుల అరెస్టు

- రూ.10.56 లక్షల నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం


ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ భావన, సీఐ సదాశివయ్య

ప్రొద్దుటూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బెంగళూరును కేంద్రంగా ప్రొద్దుటూరులో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ కార్యకలాపాలు సాగిస్తున్న నిర్వాహకులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ భావన తెలిపారు. శుక్రవారం డీఎస్పీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీన ఆన్‌లైన్ బెట్టింగ్ కేసులో ఆరుగురు అరెస్టయ్యారన్నారు. వారిచ్చిన సమాచారం మేరకు క్రికెట్ బెట్టింగ్ ముఠాలో కీలకసభ్యులైన మండల పరిధిలోని లింగాపురానికి చెందిన ధనికల వీరశంకరయ్య అలియాస్ వీరశంకర్, కాశినాయన మండలానికి చెందిన చంద్ర యాదవ్‌ను అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.10.56 లక్షల నగదు, మూడు సెల్‌ఫోన్లు, ఒక బ్యాగు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారు బెంగళూరులో పేయింగ్ గెస్ట్ (పీజీ) హాస్టల్ నడుపుతూ ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారన్నారు. తెలిసిన వారిని నమ్మించి వారికి డబ్బులు ఇచ్చి వివిధ బ్యాంకులలో కరెంట్ అకౌంట్లు ఓపెన్ చేయించి ఆ పాసుబుక్కుల ద్వారా ఆన్‌లైన్ బెట్టింగ్ లావాదేవీలు నడిపేవారన్నారు. వారు రాయల్ బుక్ 365 డాట్ ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ సాగించే వారన్నారు. బెట్టింగ్‌కు సంబంధించి అనుమానాస్పద లావాదేవీలు జరిపిన అకౌంట్లను ఫ్రీజ్ చేయమని బ్యాంకు అధికారులను కోరామన్నారు. ఇంకా ఈ ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లో ఉన్న వారందరిని అరెస్టు చేస్తామన్నారు. ఈ బెట్టింగ్ ముఠా గుట్టు రట్టు చేసిన టూటౌన్ సీఐ సదాశివయ్యను, పోలీసు సిబ్బందిని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య 7లో..

పరిశుభ్రత-పచ్చదనం కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



పరిశుభ్రత - పచ్చదనం

- జిల్లా అంతటా ఉదయం 6 గంటలకే ప్రారంభం
- జడ్పీ సీఈవో, డీడీవో, డీఎల్పీవోల పర్యవేక్షణ

కడప రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల సుస్థిర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పరిశుభ్రత-పచ్చదనం కార్యక్రమాన్ని శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టింది. ఈ మేరకు జిల్లాలో జడ్పీ సీఈవో ఓబులమ్మ పర్యవేక్షణలో మండలాల వారీగా ఎంచుకున్న గ్రామ పంచాయతీలలో పరిశుభ్రత-పచ్చదనం కార్యక్రమాన్ని అట్టహాసంగా చేపట్టారు. ఆయా గ్రామ పంచాయతీలలో ఉదయం 6 గంటల నుంచి 10-30 వరకు కార్యక్రమాన్ని చేపట్టారు. మండలంలోని హరిత రాయబారులు, గ్రీన్ గార్డ్స్, సచివాలయ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఆశాకార్యకర్తలు, గ్రామపంచాయతీ కార్యదర్శి, డిప్యూటీ ఎంపీడీవో, ఎంపీడీవో తదితరుల బృందం పంచాయతీ పరిధిలోని గ్రామాలను పరిశుభ్రం చేయడంతో పాటు ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. వార్డుల వారీగా ఇళ్ల నుంచి తడిచెత్త, పొడిచెత్తను సేకరించి ఎస్‌డబ్ల్యూపీసీ సెంటర్లకు తరలించారు. జడ్పీ సీఈవో ముద్దనూరు గ్రామపంచాయతీలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. పంచాయతీలను పరిశుభ్రత-పచ్చదనంతో తీర్చిదిద్ది తద్వారా పర్యావరణ స్థిరత్వాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామన్నారు. త్వరలో స్వచ్ఛ రథాల ద్వారా తడి, పొడి చెత్తను అందించిన వారికి గృహ అవసరాలకు కావలసిన అల్లం, వెల్లుల్లి, ఉల్లి, షాంపు మొదలైన సరుకులు అందిస్తామన్నారు.


తడి, పొడి చెత్తను వేరు పరుస్తున్న సిబ్బంది

జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు జైసూర్య నాయక్



సుండుపల్లె, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు సుండుపల్లె మండలంలో పంచాయతీరాజ్ ఏఈగా విధులు నిర్వహిస్తున్న జైసూర్య నాయక్ ఎంపికైనట్లు వారి కుటుంబీకులు శుక్రవారం తెలిపారు. గురువారం విజయవాడలో జరిగిన ఆలిండియా సివిల్ సర్వీసెస్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి చత్తీస్‌ఘడ్ లేదా గోవా రాష్ట్రాల్లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తరపున పోటీ చేస్తారని తెలియజేశారు. ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే బ్యాడ్మింటన్‌పై తనకున్న మక్కువతో మారుమూల మండలం నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవడం పట్ల కుటుంబీకులు, సాటి ఉద్యోగులు అభినందనలు తెలియజేస్తున్నారు. కాగా జైసూర్యనాయక్ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి బ్యాడ్మింటన్ పట్ల విశేషమైన అభిమానం ఉందని, మరింత కష్టపడి అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ఫిర్యాదుల పరిష్కారమే లక్ష్యం

- ప్రతిరోజూ ఫిర్యాదుల స్వీకరణ తప్పనిసరి
- డీఈవో, ఎంఈవోలకు విద్యాశాఖ ఆదేశాలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖలో సేవల నాణ్యత పెంపు, బాధ్యతాయుత పరిపాలన, ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తరఫున డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ విజయరామరాజు రాష్ట్రంలోని అన్ని జిల్లాల డీఈవోలు, ఎంఈవోలను నేరుగా ఉద్దేశిస్తూ ఈనెల 19వ తేదీన కీలక ఉత్తర్వులు జారీ చేశారు. రోజూ కార్యాలయంలోనే ఉండి ఫిర్యాదులు స్వీకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రజలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తమ సమస్యలు చెప్పాలంటే అధికారులు కార్యాలయంలో అందుబాటులో లేరన్న విమర్శలు తరచూ విద్యాశాఖ దృష్టికి వస్తున్నాయి. దీనిని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని ప్రతి పని దినంలో తప్పనిసరిగా ఒక గంట సమయం ప్రజా ఫిర్యాదులకు కేటాయించాలని స్పష్టంగా తెలిపింది. ఆయా సమయాల్లో అధికారులు సంబంధిత కార్యాలయాల్లో లేకుంటే కఠిన చర్యలు



తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేసింది.

నిరంతరం అందుబాటులో..

ప్రభుత్వ విధానాల ప్రకారం పాఠశాల విద్యాశాఖలో ఫిర్యాదుల పరిష్కారం అత్యంత ప్రాధాన్యత అంశం. గ్రామం నుంచి జిల్లా వరకు.. ఉపాధ్యాయుల నుంచి తల్లిదండ్రుల వరకు.. విద్యార్థుల సంక్షేమం మొదలు పాఠశాలల అభివృద్ధి వరకు ప్రజలు ఎదుర్కొనే ప్రతి సమస్యకు స్పందన త్వరగా లభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో అధికారులు ప్రతిరోజూ వారికి కేటాయించిన సమయాల్లో అందుబాటులో ఉంటే సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయని విద్యాశాఖలో ఆశాభావం వ్యక్తమవుతోంది.

ఈ సమయాల్లో ఉండాల్సిందే..

ఎంఈవోలు ప్రతిరోజు సాయంత్రం 4 నుంచి 5గంటల వరకు వారి కార్యాలయాల్లో ఉండాలి. డీఈవోలు సాయంత్రం 5 నుంచి 6గంటల వరకు ఉండాలి. ఈ గంటల్లో అధికారులు తమ కార్యాలయాల్లోనే ఉండి, ఉపాధ్యాయుల సమస్యలు, పాఠశాలల మౌలిక వసతులు, విద్యార్థుల సేవలకు సంబంధించిన సమస్యలు, పరిపాలన ఇబ్బందులకు సంబంధించిన సమస్యలపై వినతులు స్వీకరించి వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు. తమ పరిధిలోని ఎంఈవోలు ఈ టైమింగ్స్‌ను కచ్చితంగా పాటించేలా డీఈవోలు పర్యవేక్షించాలని కూడా పేర్కొంది. దీనికి విరుద్ధంగా వ్యవహరిస్తే తీవ్రంగా పరిగణిస్తామని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

చెయ్యేరుపై బ్రిడ్జి నిర్మించేదెప్పుడో ?

● 3 కి.మీ. దూరానికి 30 కి.మీ. ప్రయాణం ● పెనగలూరు, నందలూరు మండల ప్రజలకు అగచాట్లు



నీటి ప్రవాహంలో పాడైన రోడ్డుపై తాత్కాలిక ప్రయాణాలు సాగిస్తున్న ప్రజలు

పెనగలూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పెనగలూరు-నందలూరు మండలాల మధ్య ప్రవహిస్తున్న చెయ్యేరునదిపై హైలెవల్ బ్రిడ్జి లేక రెండు మండలాల ప్రజల ప్రయాణాలు నరకయాతనగా మారాయి. పెనగలూరు మండలం ఓబిలి గ్రామం ద్వారా నందలూరు మండలం టంగుటూరు గ్రామం ద్వారా రెండు మండలాలను కలుపుతూ చెయ్యేరునదిపై ఉన్న మట్టిరోడ్డుపైనే ఇరువైపులా 30 గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణాలు సాగిస్తున్నారు. వర్షాలు బాగా వచ్చినప్పుడల్లా ఈ మట్టిరోడ్డు మధ్యలో కొంతదూరం కొట్టుకు పోవడం.. నీరు తగ్గినప్పుడు రెండు మండలాల అధికారులు, నాయకులు మరలా తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేయడం జరుగుతూ వస్తోంది. మట్టిరోడ్డు కొట్టుకుపోతే చుట్టూ 30 కి.మీ. తిరిగి వెళ్లాల్సి వుంటుంది. ఈ మట్టిరోడ్డు స్థానంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని రెండు దశాబ్దాలుగా నాయకులు అధికారులతో ప్రజలు పోరాటం చేస్తున్నప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే బ్రహ్మయ్య హయాంలో రూ.4 కోట్ల వ్యయంతో లోలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపగా ఆర్అండ్‌బీ శాఖ ద్వారా నిధులు మంజూరైనప్పటికీ టెండర్లు పిలవకపోవడంతో అప్పట్లో ఆ పనులు ఆగిపోయాయి. అప్పటి నుంచి మరలా బ్రిడ్జి నిర్మాణానికి రెండు మండలాల్లోని 30కి పైగా గ్రామాల ప్రజలు, నాయకులు అధికారులకు విన్నవిస్తున్నా బ్రిడ్జి నిర్మాణ పనులు కార్యరూపం దాల్చలేదు.

2019-24 మధ్యకాలంలో రాజంపేట ఎమ్మెల్యే సహకారంతో చెయ్యేటిలో ఉన్న మట్టి రోడ్డును పటిష్టం చేస్తూ మరలా రోడ్డు నిర్మించారు. అయితే 2021లో అన్నమయ్య డ్యామ్ తెగిపోవడంతో మట్టిరోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. అప్పటి నుంచి కొట్టుకుపోయిన మట్టిరోడ్డు స్థానంలో మరలా రోడ్డు నిర్మించారు. అయితే నెల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు చెయ్యేటిలో వరదనీరు పారుతుండడంతో మట్టిరోడ్డు పలుచోట్ల కొట్టుకుపోయింది. చెయ్యేటిలో తరచుగా నీటి ప్రవాహం పెరుగుతూ తగ్గుతూ ఉండడం వల్ల మట్టిరోడ్డు పునఃనిర్మించేందుకు అవకాశం లేకుండా పోయింది. అందువల్ల నీటిలో లోతు తక్కువగా ఉన్న ప్రదేశాల నుంచి రెండు వైపులా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ఓబిలి-టంగుటూరు మధ్యలో చెయ్యేటి నదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మిస్తే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పెనగలూరు మండలం లోని ఓబిలి, అతిగారిపల్లె, బెస్తపల్లె, సిద్దవరం, ఇండ్లూరు, కొత్తపల్లె, సత్తుపల్లె గ్రామాల ప్రజలతో పాటు నందలూరు మండలంలోని టంగుటూరు, పాచికాలువ, లేబాక, చింతకాయలపల్లె, కొమ్మూరు, కోనాపురం, నల్లతిమ్మాయపల్లె తదితర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

హైలెవల్ బ్రిడ్జి నిర్మిస్తే ఉపయోగకరం



ఓబిలి-టంగుటూరు గ్రామాల మధ్యలో చెయ్యేటి నదిపై ప్రభుత్వం హైలెవల్ వంతెన నిర్మిస్తే రెండు మండలాల్లోని 30 గ్రామాల ప్రజల ప్రయాణాలకు ఉపయోగంగా ఉంటుంది. చాలా కాలంగా చెయ్యేటి నదిలో బ్రిడ్జి నిర్మించాలని ప్రభుత్వంతో పోరాడు తున్నాం. అది కార్యరూపం దాల్చడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హైవే బ్రిడ్జి నిర్మించాలి.

- ఎస్.అమీరుల్లా, ఓబిలి గ్రామ టీడీపీ ఇన్‌చార్జి

నిధులు నిష్ప్రయోజనం అయ్యాయి



మాజీ ఎమ్మెల్యే, చిన్ననీటి తరహా మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మయ్య హయాంలో తాను ఓబిలి సర్పంచ్‌గా ఉన్నాను. తన హయాంలో చెయ్యేటి నదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలనే ఉద్దేశ్యంతో పట్టుబట్టి బ్రహ్మయ్య ద్వారా రూ.4 కోట్లు బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాం. కొన్ని రాజకీయ కారణాల వల్ల టెండరు ప్రక్రియ దాకా రాలేదు. ఇప్పటికైనా అధికార పార్టీ నాయకులు స్పందిస్తే బాగుంటుంది.

- ఎస్.హబీబుల్లా, మాజీ సర్పంచ్, ఓబిలి

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● డీఎంహెచ్‌వో నాగరాజు



వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్న జిల్లా వైద్యాధికారి నాగరాజు

సిద్దవటం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత పాటించి దోమల వ్యాప్తిని అరికట్టాలని కడప డీఎంహెచ్‌వో నాగరాజు తెలిపారు. మండలంలోని మాధవరం-1 పార్వతిపురం గ్రామంలో శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాత్రివేళల్లో దోమలు కుట్టకుండా ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని సూచించారు. కుష్ఠువ్యాధి బాధితులను పరామర్శించి తగు జాగ్రత్తలు సూచించారు. కాళ్లు వంకర ఉన్న వారు ఫిజియోథెరపీ చేయించుకోవాలని తెలిపారు. మాధవరం ప్రైమరీ హెల్త్‌సెంటర్ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ నవంబరు 17 నుంచి గ్రామీణ ప్రాంతాల్లో స్పర్శలేని పొడలు ఉన్నవారిని గుర్తించి జాగ్రత్తలు, సలహాలు సూచించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రవిబాబు, మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు వైద్యాధికారి డాక్టర్ శివకుమార్, డీపీఎంవో రాఘవ, హెల్త్ సూపర్‌వైజర్ రమణయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి



అభిషేక్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

రామసముద్రం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతున్న విద్యార్థి అభిషేక్‌కుమార్(17) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. జక్కం వారిపల్లె వాసి అభిషేక్‌కుమార్ ఇంటర్ చదువుతున్నాడు. కాలేజీకి సరిగా వెళ్లలేదని విద్యార్థి తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్థాపానికిగురై ఈనెల 13న విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మదనపల్లెలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.

పిడుగుపాటుతో మహిళకు తీవ్రగాయాలు



పిడుగుపాటుకు గురైన గౌరమ్మ

ఓబులవారిపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పున్నాటివారిపల్లె అరుంధతివాడకు చెందిన గొడుగునూరు గౌరమ్మ అనే మహిళ పిడుగుపాటుతో తీవ్రంగా గాయపడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గొడుగునూరు గౌరమ్మ, లేబాకు రామలక్షుమ్మ శుక్రవారం గొర్రెలు మేపుకునేందుకు పచ్చిక బీళ్లలోకి వెళ్లారు. సాయంత్రం 4 గంటల సమయంలో వారికి సమీపంలోనే పిడుగు పడడంతో ఇద్దరూ కుప్పకూలి పోయారు. ఈ సంఘటనలో గౌర మ్మకు తీవ్ర గాయాలయ్యాయి. కొద్దిసేపటికి తేరుకున్న రామలక్షుమ్మ పరుగెత్తుకొంటూ ఇంటికి వెళ్లి బంధువులకు, కుటుంబ సభ్యులకు విషయం తెలిపింది. దీంతో వారు గౌరమ్మను రైల్వేకోడూరు ఆసుపత్రికి తరలించారు. టీడీపీ నాయకుడు పున్నాటి వాసుదేవరెడ్డి పరామర్శించారు.

చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరు అరెస్ట్



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

తంబళ్లపల్లె, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రామిగానిపల్లె వద్ద ఈ నెల 15వ తేదీన చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం తంబళ్లపల్లె మండలం కుక్కరాజుపల్లె క్రాస్ వద్ద అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా నిందితులు నేరం అంగీకరించారన్నారు. నిందితులు నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం విరువూరుకు చెందిన గడ్డం కాశిరెడ్డి(21), కడప జిల్లా సీకే దిన్నె మండలం గురుగుపుడు తండాకు చెందిన బి.సతీష్‌నాయక్(25)గా తెలిపారు. నిందితుల నుంచి 36 గ్రాముల బంగారు చైన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

జీవనోపాధి మెరుగుకై దృష్టి సారించండి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ నాగేశ్వరరావు

తంబళ్లపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల్లోని సభ్యుల జీవనోపాధి మెరుగుపరచడంపై దృష్టి సారించాలని సెర్ప్-డీఆర్‌డీఏ పీడీ నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు మహిళా సమాఖ్య కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల ఏపీఎంలు, డీపీఎంలు, ఏరియా కోఆర్డినేటర్లు, సీసీలతో పీడీ సమీక్షించారు. మహిళా సంఘాల సభ్యులు బ్యాంకు లింకేజీ రుణాలను సద్వినియోగం చేసుకుని సకాలంలో తిరిగి చెల్లించేలా చూస్తూ సంఘాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. వ్యాపార అవకాశాలు, రాయితీ రుణాలు, ప్రభుత్వం అందించే ఇతరత్రా ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తూ మహిళలు సద్వినియోగం చేసుకునేలా చైతన్య పరచాలన్నారు. మహిళలను లక్షాధికారులు చేయడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ ఏపీడీ లక్ష్మీ ప్రసాదరెడ్డి, ఏపీఎంలు గంగాధర్, శ్రీలక్ష్మీ, నాగార్జున, శ్రీనిధి మేనే జరు అమరావతి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రామలక్ష్మీ, డీపీ ఎంలు, ఏరియా కోఆర్డినేటర్లు, సీసీలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు భవన్‌సాయి

మదనపల్లె అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు వేద పాఠశాల విద్యార్థి జి.భవన్‌సాయి చంద్రకుమార్ ఎంపికైనట్లు కోచ్ రెడ్డి రాఘవేంద్ర తెలిపారు. చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అంతర జిల్లా క్రీడల్లో మొదటి స్థానంలో నిలిచారన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అఫ్ ఇండియా అండర్ 14 క్రికెట్ క్రీడలు ఈ నెల 29 నుంచి గుంటూరులో జరగనున్నాయి. ఇందులో ఎంపికైన విద్యార్థిని పాల్గొంటాడని శ్రీవేద పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మీనారాయణరెడ్డి, చైర్మన్, రాజు రామమోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఉపేంద్రరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మురళి, ఏవోలు కిషోర్, నాగరాజ, కోచ్ రెడ్డి రాఘవేంద్ర వ్యాయామ ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఆ నిర్మాణాలకు అనుమతి లేదు..

- ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు

బి.కొత్తకోట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బెంగళూరు రోడ్డు గంగమ్మ మాన్యం పక్కన నిర్మిస్తున్న షెడ్లకు తమ కార్యాలయం నుంచి ఎలాంటి అనుమతులు లేవని నగర పంచాయతీ కమిషనర్ జీవీ పల్లవి ప్రకటించారు. రూ.కోట్ల విలువైన ఈ వివాదాస్పద స్థలంలో హక్కు తమదంటే, తమదంటూ ఇరు వర్గాలూ పోటీ పడుతున్నాయి. ఇందులో బలమైన వర్గం అన్ని శక్తులూ ప్రయోగించి షెడ్ల నిర్మాణం చేపట్టి దాదాపుగా ముగించింది. ఇందులో భూమి హక్కులు ఎవరికున్నా నిర్మాణాలకు నగర పంచాయతీ, టౌన్ ప్లానింగ్ అధికారుల అనుమతులు తప్పనిసరి. అయితే ఎటువంటి అనుమతులూ లేకుండా నిర్మాణాలు చేపట్టారు. వాటిని తక్షణం ఆపాలంటూ కమిషనర్ నోటీసులు జారీ చేశారు. అయినా వాటిని బేఖాతరు చేస్తూ నిర్మాణాలు చేపట్టారు. ఓ వైపు నిర్మాణాలు జరుగుతూనే వుండగా మరోవైపు ప్రత్యర్థి వర్గం వాటిని ఆపడానికి విశ్వప్రయత్నాలు చేస్తూనే వుంది. ఈ క్రమంలో నిర్మాణ స్థలం వద్ద జరిగిన గొడవలకు సంబంధించి బి.కొత్తకోట స్టేషన్‌లో ఈనెల 19న ఓ వర్గానికి చెందిన గడ్డం క్రిష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు డేరంగుల ఓబులేసుపై కేసు నమోదైంది. అయితే ఈ నెల 20న ఓబులేసు అనే వ్యక్తి వివాదాస్పద స్థలం వద్దకు వచ్చి మరోసారి దాడి చేసి మళ్లీ గాయపరిచాడని పోలీసులు పేర్కొంటున్నారు. ఈ విషయమై కమిషనర్ మాట్లాడుతూ ఒకసారి నోటీసులు ఇస్తే నిర్మాణాలు ఆపకుండా తమ వద్దనున్న కాగితాలు తెచ్చి చూపించారని, అవి సక్రమంగా లేవన్నారు. మేము వెళ్లి పరిశీలించినప్పుడు పనులు ఆపుతారు.. మేము వెళ్లగానే మళ్లీ కడుతున్నారన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాము. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయన్నారు.

మార్కెట్ కమిటీ స్థలానికి ప్రహరీ గోడ నిర్మాణం



ఆయిల్ సీడ్స్ వద్ద సర్వే చేస్తున్న ఏఎంసీ చైర్మన్, డీఈ

పీలేరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పీలేరు-తిరుపతి మార్గంలోని ఆయిల్ సీడ్స్ వద్దనున్న రెండెకరాల పీలేరు మార్కెట్ కమిటీ స్థలానికి ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టనున్నట్లు ఏఎంసీ అధ్యక్షుడు పురం రామ్మూర్తి తెలిపారు. ఆయిల్ సీడ్స్ వద్ద పీలేరు మార్కెట్ కమిటీకి గతంలో ప్రభుత్వం రెండెకరాల స్థలం కేటాయించింది. వైసీపీ ప్రభుత్వంలో కొందరు ఆ స్థలాన్ని ఆక్రమించుకునే ప్రయత్నం చేయగా టీడీపీ నేతల ప్రతిఘటనతో వెనక్కు తగ్గారు. ఏఎంసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తరువాత పురం రామ్మూర్తి ఆ స్థల పరిరక్షణకు ప్రహరీ గోడ నిర్మించాలని ఉన్నతాధికారులకు విన్నవించడమే కాకుండా ఇటీవల పీలేరు పర్యటనకు వచ్చిన మార్కెటింగ్ శాఖ కడప రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ లావణ్య దృష్టికి తీసుకెళ్లారు. ఆమె ఆదేశాల మేరకు శుక్రవారం మార్కెటింగ్ శాఖ డీఈ మేఘనాథం సందర్శించారు. స్థల పరిశీలన జరిపి ప్రహరీ గోడ నిర్మాణానికి ప్రాథమిక సర్వే నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్కెట్ కమిటీల ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, త్వరలోనే ప్రహరీ గోడ నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి హరినాధ్, సూపర్‌వైజర్ భగవాన్, తదితరులు పాల్గొన్నారు.

వివాహమైన మూడు నెలలకే విగతజీవిగా..



ఆత్మహత్య చేసుకున్న లావణ్య

మదనపల్లె అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వివాహమై మూడు నెలలు గడవకనే ఓ వివాహిత జీవితం ముగిసింది. తాలుకా పోలీసుల వివరాల మేరకు.. మదనపల్లె మండలం, బసినికొండ గ్రామం, పుంగనూరు రోడ్డుకు చెందిన వెంకటేశ్‌కు, మదనపల్లె మండలం, బండకాడపల్లెకు చెందిన లావణ్య(18)తో పెద్దల సమక్షంలో రెండున్నర నెలల క్రితం వివాహం జరిపించారు. ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ శుక్రవారం రాత్రి ఇంట్లోనే తన చీరకు ఉరేసుకుని వేలాడుతూ లావణ్య కనిపించింది. కుటుంబ కలహాలు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. వెంటనే కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఈ మేరకు మదనపల్లె తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మాక్ అసెంబ్లీకి ఏడుగురు విద్యార్థులు ఎంపిక

● జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం



విద్యార్థులతో డీఈవో సుబ్రహ్మణ్యం తదితరులు

రాయచోటిటౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న అమరావతిలో నిర్వహించనున్న మాక్ అసెంబ్లీలో పాల్గొనేందుకు అన్నమయ్య జిల్లా నుంచి ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని డైట్ కేంద్రంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మడితాటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో మాక్ అసెంబ్లీకి ఎంపికైన విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. శాసన సభ సమావేశాల నిర్వహణ, ప్రశ్నోత్తరాల సమయం, స్పీకర్, డిప్యూటీ స్పీకర్ విధులపై అవగాహన కల్పించారు. ఎంపికైన విద్యార్థుల్లో నిమ్మనపల్లి మండలం రాచవీటిపల్లి జడ్పీ హైస్కూల్‌కు చెందిన పార్థసారథి, పీలేరు మండలం ఎంజేపీ పాఠశాలకు చెందిన తేజశ్రీ, బి.కొత్తకోట మండలం బాలుర జడ్పీ హైస్కూల్ విద్యార్థి అనిల్‌కుమార్, రాయచోటి మండలం మాసాపేట జడ్పీ హైస్కూల్‌కు చెందిన సుష్మతాజ్, వీరబల్లి మండలం జడ్పీ హైస్కూల్‌కు చెందిన కొల్లి వీక్షిత, పెనగలూరు మండలం ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన నూర్ ఆయేషా, రాజంపేట మండలం బోయినపల్లి జడ్పీ హైస్కూల్‌కు చెందిన పట్నం రెడ్డిసాయి ఉన్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి మాక్ అసెంబ్లీలో పాల్గొనే అద్భుత అవకాశం మన జిల్లాకు చెందిన విద్యార్థులకు లభించడం గర్వకారణమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులు ప్రజాస్వామ్య విలువలు, శాసన వ్యవస్థపై అవగాహన పెంపొందించడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో గైడ్ టీచర్స్ శివారెడ్డి, రామలక్ష్మీ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సమగ్ర శిక్ష ఏపీవో చంద్రశేఖర్, ఏఎస్‌వో భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్‌లో ఇబ్బందులు లేకుండా రీసర్వే

● పైలట్ ప్రాజెక్టును పరిశీలించిన రాష్ట్ర సర్వేశాఖ డిప్యూటీ డైరెక్టర్



పెంచుపాడు గ్రామం వద్ద రీసర్వే వివరాలను తెలుసుకుంటున్న గౌస్‌బాషా, భరత్

మదనపల్లెటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్‌లో గ్రామాల హద్దులు, రైతుల భూముల హద్దుల గుర్తింపులో ఇబ్బందులు లేకుండా మూడో విడత రీసర్వే నిర్వహిస్తున్నామని రాష్ట్ర సర్వేశాఖ డిప్యూటీ డైరెక్టర్ గౌస్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం మదనపల్లె మండలం పెంచుపాడు వద్ద జరుగుతున్న రీసర్వే పనులను జిల్లా సర్వే ఏడీ భరత్‌తో కలిసి డిప్యూటీ డైరెక్టర్ పరిశీలించారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా పెంచుపాడు గ్రామంలో మూడో విడత సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు వచ్చామన్నారు. ఇక్కడ వచ్చే సమస్యలు, వాటిని ఎలా పరిష్కరించాలో తదితర విషయాలను జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తామన్నారు. రైతులందరి సమక్షంలో ఈ సర్వే చేయించడంతో పాటు, సర్వే విషయాలను గ్రామ సభలు నిర్వహించి రైతుల ఆమోదంతోనే రికార్డుల్లోకి ఎక్కిస్తామన్నారు. పాత విలేజ్ మ్యాపుల ఆధారంగా రీసర్వే నిర్వహించడంతో పాటు దారి సమస్యలు లేకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రభుత్వ స్థలాలు, వాగులు, వంకలు ఆక్రమణలను గుర్తించడం, రెవెన్యూ అధికారుల సహకారంతో ఆక్రమణలు తొలగిస్తామన్నారు. ముఖ్యంగా వాటర్ బాడీస్ ఆక్రమణలను ఉపేక్షించేది లేదన్నారు. పెంచుపాడు పంచాయతీ తేనెటీగలపల్లె, గొల్లపల్లె హ్యాబిటేషన్లలో భూమి జాయింట్ హద్దుల సమస్యలు వున్నాయని రైతులు గౌస్‌బాష దృష్టికి తీసుకెళ్లడంతో వాటిని దగ్గరుండి పరిష్కరించాలని మండల సర్వేయర్ సుబ్రమణ్యంను ఆదేశించారు. కార్యక్రమంలో విలేజ్ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

గుండ్లపల్లెను మోడల్ విలేజ్‌గా తయారు చేద్దాం

● ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఫోర్డు సంస్థ డైరెక్టరు లలితమ్మ

తంబళ్లపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపల్లెను ప్రకృతి వ్యవసాయంలో మోడల్ విలేజ్‌గా తయారుచేసి మిగతా గ్రామాలకు ఆదర్శంగా నిలుపుదామని ఫోర్డు సంస్థ డైరెక్టరు లలితమ్మ పిలుపునిచ్చారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీఓ అంజనప్ప, ఏపీ సీఎన్ఎఫ్(ఏపీ రైతు సాధికార సంస్థ) సిబ్బందితో కలసి ప్రకృతి వ్యవసాయంపై ఉపయోగాలు, ఆవశ్యకత, రైతుల బీడు భూములను వ్యవసాయ భూములుగా మార్చడం, మొక్కలు నాటడం, నీటి కుంటల ఏర్పాటు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ కార్యాలయ ఏఓ థామస్‌రాజ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, మన పూర్వీకుల్లా సేంద్రీయ పద్ధతుల్లో వ్యవసాయం చేయడం వైపు రైతులు దృష్టి పెట్టాలన్నారు. ఏపీఎఫ్ ప్రాజెక్ట్ కన్సల్టెంట్ డాక్టర్ ప్రహ్లాద మాట్లాడుతూ గుండ్లపల్లె పంచాయతీలోని పాపిరెడ్డిగారిపల్లె, చెట్లవారిపల్లె, గుండ్లపల్లె గ్రామాలను ప్రకృతి వ్యవసాయానికి పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫోర్డు సిబ్బంది వీవీ రమణ, సంపూర్ణ, హేమంత్‌కుమార్ వ్యవసాయ శాఖ సిబ్బంది సుప్రియ, రైతు సాధికార సంస్థ సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ విజేతలు.. వైజాగ్, అనంతపురం జట్లు

మదనపల్లెఅర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా మదనపల్లె మండలం, పుంగనూరు రోడ్డులోని గ్రీన్‌వ్యాలీ స్కూల్‌లో ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ సమాఖ్య, చంద్రమాకులపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-14 బాలుర విజేతలుగా వైజాగ్, బాలికల విజేతలుగా అనంతపురం జట్లు నిలిచాయని ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి డాక్టర్ ఎస్‌బాబు, అడ్మిన్ కార్యదర్శి శారద, ఆర్గనైజింగ్ కార్యదర్శి మురళీధర తెలిపారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాష విజేతలకు ట్రోఫీలు, మెడల్స్ ప్రదానం చేశారు. ఈ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఏపీ స్కూల్ గేమ్స్ అండర్-14 జట్లకు ఎంపిక చేసినట్లు అబ్జర్వర్ పాల్ తెలిపారు.

10 మంది పేకాటరాయళ్లు అరెస్టు

● రూ.24,640 నగదు, బైకులు, ఆటో స్వాధీనం

మదనపల్లెఅర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పేకాడుతున్న పది మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.24.640 నగదు, పది సెల్‌ఫోన్లు, రెండు బైకులు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ సీఐ రాజారెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. మదనపల్లె పట్టణం టీకెపల్లె కాలనీ సమీపంలో ఓపెన్ ప్లేసులో పేకాడుతున్నట్లు సమాచారం అందడంతో తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని పేకాట స్థావరంపై దాడి చేసినట్లు సీఐ వివరించారు. ఈ మేరకు వారిని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.



లోన్ యాప్... తస్మాత్ జాగ్రత్త

● అవసరమని తీసుకుంటే.. మీ అకౌంటును ఖాళీ చేస్తారు
● ఆన్‌లైన్ యాప్‌లతో వేధింపులు తప్పవు
● 11 నెలల్లో 271 ఫిర్యాదులు.. రూ.42లక్షలు పైనే స్వాహా



కడప క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మన ఆర్థిక అవసరాలను ఆసరా చేసుకుని వేధింపులకు, ఆర్థిక మోసాలకు పాల్పడే ఫేక్ లోన్ యాప్‌లు పుట్టగొడుగుల్లా పుట్టుకొ స్తున్నాయి. ఈ రుణ యాప్‌ల వలలో చిక్కుకొని కొందరు విలవిలలాడుతున్నారు. తమ అవసరాల కోసం రుణాలు పొందిన వారి నుంచి అంతకు పదిం తలు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఒకవేళ డబ్బులు కట్టకపోతే మొబైల్‌లో ఉన్న డేటా దొంగలించి ఫొటోలు మార్ఫింగ్ చేసి కాంటాక్టులో ఉన్న అందరికీ షేర్ చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతుంటారు. ఒకప్పుడు పర్సనల్ లోను తీసుకోవాలంటే చాల పెద్ద ప్రాసెస్ ఉండేది. బ్యాంకుల్లో లోను కోసం దరఖాస్తు చేస్తే ఆ వ్యక్తి ఆదాయ వివరాలు అన్నీ పరిశీలించిన తరువాత రుణం మంజూరు చేయాలా లేదా అని నిర్ణయించేవారు. ఈ ప్రాసెస్ మొత్తం రెండు మూడు వారాల నుంచి నెలల సమయం పడుతుం డేది. ఇప్పుడు పర్సనల్ లోను తీసుకోవాలంటే మంచి క్రెడిట్ హిస్టరీ ఉంటే ఆన్‌లైన్‌లో పది నిమిషాల్లోనే రుణం పొందవచ్చు.

సోషల్ మీడియాలో వచ్చే లోన్ యాప్‌లను నొక్కి మనకు కావలసిన అమౌం టుతో పాటు మన వ్యక్తిగత వివరాలు పొందుపరచాల్సి ఉంటుంది. అయితే సదరు సంస్థలకు సకాలంలో రుణాలు చెల్లించకపోతే యాప్‌ల నిర్వాహకులు వేధింపులు మొదలు పెడ తారు. వీళ్ల వేధింపులు తాళలేక ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు కూడా గతంలో ఎన్నో ఉన్నాయి. ఇలాంటి సోషల్ మీడియాలో వచ్చే నకిలీ యాప్‌ల పట్ల జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వేధింపులు తాళలేక...

జిల్లాలో యాప్‌ల ద్వారా లోన్లు పొందిన వారు 11 నెలల్లో దాదాపు 271 మంది ఉన్నా రంటే.. ఎలా మోసపోతున్నారో ఇట్టే అర్థమవుతుంది. ఇక లోను యాప్‌ల ద్వారా లోన్ తీసుకున్న వారు తీసుకున్న డబ్బుల కంటే దాదాపు 42 లక్షల వరకు అధిక వసూళ్లకు పాల్పడ్డారు. దీంతో లోను యాప్ నిర్వాహకుల వేధింపులు తాళలేక చివరికి పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా ఇలాంటి లోను యాప్‌లపై తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నకిలీ యాప్‌లే ఎక్కువ

తమ అవసరాల నిమిత్తం డబ్బు కోసం సోషల్ మీడియాను కొంతమంది వేదికగా చేసుకుంటున్నారు. అందులో వచ్చే ప్రకటనలకు ఆకర్షితులై లింకులు క్లిక్ చేసి తమ వ్యక్తిగత సమాచారం ఇవ్వడంతో వారి మొబైల్‌లో ఉన్న డేటాను సైబర్ నేరగాళ్లు కొట్టేస్తారు. మొత్తం మన మొబైల్‌లో ఉన్న అన్ని కాంటాక్టు నెంబర్లు, ఫొటోలు, డేటాను యాక్సస్ చేసుకుంటారు. ఇది లోన్ తీసుకున్నవారి పాలిట శాపంగా మారుతుంది. ఇలాంటి వాటిపై జాగ్రత్తగా ఉండాలంటూ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మోసపోయిన బాధితుల్లో కొందరు...

● కడపకు చెందిన ఓ యువతి తన అవసరాల కోసం రుణయాప్ ద్వారా రూ.50వేలు తీసుకుంది. తీసుకున్న డబ్బు కంతుల వారీగా చెల్లించింది. అయినా సైబర్ నేరగాళ్లు ఆ యువతినే డబ్బులు కట్టాలంటూ వేధింపులకు గురి చేశారు. తాను తీసుకున్న డబ్బులు కంటే అధికంగా డబ్బులు చెల్లించానని చెప్పినా టార్చర్ పెట్టారు. వాళ్ల టార్చర్ భరించిలేక ఆ యువతి పోలీసులను ఆశ్రయించింది.

● కడపకు చెందిన ఓ వ్యక్తి వ్యాపార అవసరాల నిమిత్తం రూ.32లక్షలు ఈ నకిలీ యాప్ ద్వారా లోను పొందారు. అయితే అతను తిరిగి డబ్బులు చెల్లిస్తున్నా మిగతా డబ్బులు కూడా కట్టాలని, లేకుంటే నీ ఫొటోలు కాంటాక్టులందరికీ పంపిస్తానని బెదిరింపులకు పాల్పడడంతో ఆ వ్యక్తి పోలీసులను ఆశ్రయించారు.

● ప్రొద్దుటూరుకు చెందిన ఓ మహిళ లోను యాప్ ద్వారా రుణం తీసుకుంది. డబ్బులు చెల్లించినప్పటికీ మళ్లీ డబ్బులు కట్టా లని రకరకాల నెంబర్ల నుంచి అతన్ని టార్చర్ పెట్టడం మొదలు పెట్టారు. ఇలాంటి సైబర్‌నేరాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. అలాగే ప్రజలు కూడా అత్యాశ పడి ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా లోను పెడితే మాత్రం మీ చేతులారా మీరే నష్టపోవాల్సి వస్తుంది.

ప్రొద్దుటూరు ఆసుపత్రి సూపరింటెండెంట్‌పై విచారణకు ఆదేశం

● డాక్టర్ లక్ష్మీప్రసాద్‌కు నోటీసులు జారీ చేసిన ప్రభుత్వం

కలికిరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గతంలో ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా పనిచేసిన డాక్టర్ లక్ష్మీప్రసాద్ వ్యవహారాలపై విచారణ జరిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం నోటీసులు జారీ చేసింది. ఆయనపై వచ్చిన అభియోగాలపై 10 రోజుల్లోగా సంజాయిషీ పంపుకోవాలని ఈ నోటీసులో ప్రభుత్వం పేర్కొంది. ప్రధానంగా ఆసుపత్రి నిర్వహణలో లక్ష్మీప్రసాద్ పూర్తిగా విఫలమైనట్లు ప్రభుత్వం నిర్ధారకొచ్చింది. రోగులను చేర్చుకోవడంలో, డిస్చార్జి చేయడంలో పారదర్శక విధానాలను, ప్రాధాన్యతలను విస్మరించారని ఆరోపించారు. ఆక్సిజన్ డిమాండు, సరఫరా ల్లో సమతుల్యత లేకుండా తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిండం కూడా ప్రభుత్వ ఆగ్రహానికి కారణమయ్యింది. ఆక్సిజన్ మేనేజ్‌మెంట్ కమిటీ, మేనేజ్‌మెంట్ టీములను ఏర్పాటు చేయడంలో విఫలమయ్యాడని కూడా అభియోగం నమోదయ్యింది. ఆసుపత్రి నోడల్ అధికారికి సహకరించడం లేదన్నది మరో ఆరోపణ. ఆక్సిజన్ సరఫరా నిర్వహణ, రోగుల సంఖ్యకు తగ్గట్లు పడకల పెంచకపోవడాన్ని కూడా ప్రభుత్వం తప్పుబట్టింది. ఆసుపత్రి వ్యవహారాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రభుత్వానికి నివేదించడంలో పారదర్శకత పాటించలేదని, రోగుల అడ్మిషన్లు, డిస్చార్జీలు, మరణాలకు సంబంధించి ఉన్నతాధికారులను తప్పుదారి పట్టించే విధంగా నిర్లక్ష్యంగా ప్రవర్తించినట్లు పేర్కొన్నారు. ప్రధానంగా ఆక్సిజన్ సరఫరాను పర్యవేక్షించడంలో అవసర మైన చర్యలు తీసుకోకపోవడాన్ని తీవ్రంగా పరిగణించారు. వీటన్నిటితోపాటు గతంలో 2021 మే 11 నుంచి 2022 మార్చి 21 వరకూ ఎలాంటి సమాచారం లేకుండా గైరుహాజరు కావడంపై కూడా వివరణ సమర్పించాలని ఆదేశిం చారు. డాక్టర్ లక్ష్మీప్రసాద్ నుంచి సంజాయిషీ అందిన అనంతరం విచారణ కు ఆదేశాలు జారీ చేయనున్నారు. ఈ మేరకు ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

సీనియర్ అసిస్టెంట్‌పై విచారణ

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో గతంలో పనిచేసిన సీనియర్ అసిస్టెంట్‌పై చిత్తూరుకు చెందిన జిల్లా వైద్యాధికారులు విచారణ చేపట్టారు. శుక్రవారం చిత్తూరు డీసీహెచ్ఎస్ పద్మాంజలిదేవితోపాటు మరో ఇద్దరితో కూడిన బృందం జిల్లా ఆస్పత్రికి చేరుకున్నారు. ఇక్కడి మెడికల్ సూపరింటెండెంట్ సుజాతతో కలిసి విచారణ చేపట్టారు. ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో నాగార్జున అనే వ్యక్తి సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి ఇక్కడి నుంచి అనంతపురం జిల్లా ధర్మవరంకు బదిలీపై వెళ్లారు. ఆ తర్వాత అతనిపై పోలీసు కేసు నమోదు అయింది. ఈ క్రమంలో దర్యాప్తుల్లో భాగంగా అతను పనిచేసిన ప్రాంతాలు, వ్యవహార శైలిపై విచారణ చేశారు. ఇక్కడ నాగార్జున పనిచేసిన కాలంలో అతని సర్వీసు రికార్డులను పరిశీలించారు. స్థానిక అధికారులను అడిగి విచారణకు సంబంధించిన అంశాలపై ఆరా తీశారు. అంతేకాకుండా ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు బదిలీపై వెళ్లిన వైద్య సిబ్బంది, అధికారుల అనధికారిక గైర్హాజరుపై కూడా అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. విచారణలో ఆర్ఎంవో డాక్టర్ శివరాం తదితరులు పాల్గొన్నారు.

పరిశోధన మెలకువలు అత్యంత ఆవశ్యకం

● సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్



మాట్లాడుతున్న రాఘవరెడ్డి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్కాలర్‌లకు పరిశోధన మెలకువలు అత్యంత ఆవశ్యకమని భారత ప్రభుత్వ సైన్స్ టెక్నాలజీ సెంటర్ ఫర్‌పాలసీ రీసెర్చ్‌కు సమన్వయకర్త, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సోషియాలజీ ప్రొఫెసర్ సి.రాఘవరెడ్డి తెలిపారు. శుక్రవారం వైఈయూ అన్న మాచార్య సెనేట్ హాల్లో స్కాలర్‌లకు పరిశోధనకు తాత్విక పునాది, పరిశోధన పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్ర మంలో ఆచార్యులు, సహ ఆచా ర్యులు, అధ్యాపకులు, స్కాలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య

పులివెందుల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రగిరిలో గుడివెల నాగేష్ (39) అప్పుల బాధ తాళలేక ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా.. గుడివెల నాగేష్ గత ఐదేళ్ల క్రితం చంద్రగిరిలో రమణమ్మ అనే మహిళను వివాహం చేసుకున్నాడు. నాగేష్ స్వగ్రామం అనంతపురం జిల్లా గాండ్లపెంట మండలం నరసప్పగారిపల్లె. చంద్రగిరిలో పెళ్లి చేసుకోవడంతో ఇక్కడే కూలి పనులకు వెళ్తూ జీవిస్తున్నాడు. ఇతనికి నాలుగేళ్ల కుమార్తె, భార్య ఉన్నారు. గత నాలుగైదు రోజులుగా నాగేష్ మూడీగా ఉండడంతో భార్య ఆరా తీసింది. అప్పులు ఎక్కువయ్యాయని, అప్పులవారి నుంచి ఒత్తిడి పెరిగిందని భార్యకు తెలిపాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో నాగేష్ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు.

ఓబన్నపేటలో వృద్ధుడు...



ఓబుళరెడ్డి మృతదేహం

కొండాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఓబన్నపేట గ్రామంలో కల్లూరు ఓబు ళరెడ్డి (71) అనే వృద్ధు డు ఆత్మహత్య చేసుకు న్నాడు. పోలీసుల వివరాల మేరకు.. మరుగుజ్జు అయిన ఓబుళరెడ్డి గత కొంతకాలంగా కడుపు నొప్పితో బాధ పడుతున్నాడు. కడుపు నొప్పి తాళలేక శుక్రవారం ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకొని మృతి చెంది నట్లు పోలీసులు తెలిపారు. ఓబుళరెడ్డి మరుగుజ్జు కావ డంతో వివాహం చేసుకోలేదు. ఒంటరిగానే ఉంటున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు కొండాపురం ఎస్సై ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

● ముగ్గురికి గాయాలు



గోపవరం/బద్వేలు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని నేషనల్ హైవే-67 నూతన బైపాస్ రోడ్డులో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒక వృద్ధురాలు మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. శుక్రవారం బెంగుళూరు నుంచి నెల్లూరు జిల్లా కందుకూరు వెళుతున్న కారు గూడెం-గుంతపల్లె మార్గమధ్యంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడటంతో బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే సంఘటన గురించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ధర్మాపురం వద్ద రోడ్డు ప్రమాదం

● ఆరుగురికి గాయాలు



గాయపడినవారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దృశ్యం

జమ్మలమడుగు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రొద్దుటూరు రోడ్డులో దర్మాపురం గ్రామం వద్ద శుక్రవారం రాత్రి 7.20 గంటలకు రోడ్డు ప్రమాదం జరిగింది. వర్షం కురుస్తున్న సమయంలో ప్రొద్దుటూరు వైపు నుంచి ప్రసాద్‌రెడ్డి, నాగేష్ అనే ఇద్దరు ద్విచక్ర వాహనంలో జమ్మలమడుగుకు వస్తుండగా కారు ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. అదే సమయంలో వెనుకవైపు వైపు నుంచి లారీ, బస్సు ఢీకొన్నాయి. ఈఘటనలో ఆర్టీసీ అద్దె బస్సు స్వల్పంగా ముందుభాగందెబ్బతింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న వీరయ్య, జయరాముడు, సింగరయ్యతోపాటు మరికొందరు గాయపడ్డారు. వారిని 108 వాహనంలో జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ హైమావతి, సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం ప్రొద్దుటూరుకు రెఫర్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం బాటిళ్లు పట్టివేత

వేంపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో గోవా మద్యం బాటిళ్లను పోలీసులు పట్టుకున్నారు. స్థానిక కడప రోడ్డుకు సమీపంలోని గరుగువీధిలో మద్యం బాటిళ్లు ఉన్నాయన్న సమాచారం మేరకు ఎస్ఐ తిరుపాల్‌నాయక్ దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నరసింహులు తెలిపారు.

వినియోగదారుల సమస్యల పరిష్కారానికే విద్యుత్ అదాలత్

● ఏపీఎస్పీడీసీఎల్ ఫోరం చైర్మన్



మాట్లాడుతున్న ఏపీఎస్పీడీసీఎల్ ఫోరం చైర్మన్, రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి

పులివెందుల రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా ఉన్న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమం చేపట్టినట్లు ఏపీఎస్పీడీసీఎల్ ఫోరం చైర్మన్, రిటైర్డ్ జడ్జి వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక విద్యుత్ డివిజన్ ఆఫీస్ కాంపౌండ్ ఆవరణలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిత్యం రైతులు, ప్రజలతో సమావేశాలు నిర్వహిస్తూ వారి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు చొరవ చూపాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి వినియోగదారులు హాజరై తమ సమస్యలు విన్నవించారు. కార్యక్రమంలో ఫోరం మెంబర్లు మధుకుమార్ (ఫైనాన్స్), ఇండిపెండెంట్ మెంబర్ విజయలక్ష్మి, పులివెందుల డివిజనల్ ఇంజనీర్ ప్రసాదరెడ్డి, ఏడీఈ గురుమోహన్‌రెడ్డి, ఏఈలు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ రాని విద్యార్థులకు ష్యూరిటీ బాండ్ ద్వారా ఇవ్వాలి

● ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి విజ్ఞప్తి

వేంపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ట్రిపుల్‌ఐటీల్లో కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఫీజు చెల్లించని కారణంగా సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. గత ప్రభుత్వం ఫీజు రీయిం బర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులకు సమస్యలు ఎదుర వుతున్నాయి. ఇలాంటి విద్యార్థులకు ష్యూరిటీ బాండ్ తీసుకొని సర్టిఫికెట్లు ఇవ్వాలని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి కలెక్టర్‌కు, ఆర్జీయూకేటీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వని కారణంగా సర్టిఫి కెట్లు ఇవ్వడం లేదంటూ పలువురు విద్యార్థులు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం కడప కలెక్టరేట్‌లో ప్రభుత్వ అంచనాల కమిటీ సమావేశంలో ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల సమస్యను ప్రస్తావించారు. ఆర్జీయూకేటీ వీసీ విజయ్‌కుమార్, రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్ సంద్ర, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామిగుప్తలకు విద్యార్థుల సమస్యలపై సానుకూలంగా స్పందించాలని కోరారు. ప్రభుత్వం ఇవ్వని బకాయిలకు ష్యూరిటీ బాండ్లు తీసుకొని సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరగా ఆర్జీయూకేటీ అధికారులు అంగీకరించినట్లు ఎమ్మెల్సీ తెలిపారు.

సోలార్ ప్రాజెక్టులో ఉద్యోగావకాశాలు

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహరాష్ట్రలో మెగా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (సోలార్ ప్రాజెక్టు)లో ఉద్యోగావకాశాలు ఉన్నట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టరు డాక్టర్ రాజ్యలక్ష్మి అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. డిప్లమా, బీటెక్, డిగ్రీ, ఎంబీఏ పూర్తి చేసినవారికి సోలార్‌లో అనుభవం ఉన్న యువతకు ఈ ఉద్యోగాలు కల్పించను న్నట్లు ఆమె వివరించారు. ఆదివారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4వరకు ఎల్ఐసీ సర్కిల్ సమీపంలో ఉన్న విశ్వేశ్వరయ్య భవన్‌లో ఇంటర్వ్యూలు జరగనున్నట్లు తెలిపారు. మరింత సమాచారం కోసం 6302702399, 7032325252 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

మట్కా ఆడుతున్న ఇద్దరు అరెస్టు

కడప క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కడప నగరం నాగరాజుపేటలో మట్కా ఆడుతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ అమర్‌నాధరెడ్డి తెలిపారు. శుక్రవారం వన్‌టౌన్ సీఐ చిన్నపెద్దయ్య ఆదేశాల మేరకు నగరంలో దాడులు నిర్వహించి.. మట్కా ఆడుతున్న ఇద్దరిని అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.6500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రాజారెడ్డి కాలనీలో చోరీ

● బంగారం, డబ్బులు ఎత్తుకెళ్లిన దుండగులు

పులివెందుల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజారెడ్డి కాలనీలో నివాసముంటున్న మునిప్రసాద్ ఇంటిలో శుక్రవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే.... లింగాల మండలం లోపట్నూతలకు చెందిన మునిప్రసాద్ తమ పిల్లల చదువుల కోసం రాజారెడ్డికాలనీలో నివాసముంటున్నారు. శుక్రవారం ఉదయం 8గంటలకు తన ఇద్దరు కుమార్తెలు, కుమారుడు స్కూల్‌కు వెళ్లగానే మునిప్రసాద్ తన భార్య లోపట్నూతలలోని పొలం పనులకు వెళ్లారు. మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో మునిప్రసాద్ కుమార్తె స్కూల్ నుంచి ఇంటికి వచ్చింది. ఆ సమయంలో ఇంటికి ఉన్న బీగాన్ని పగులగొట్టి, బీరువాలో ఉన్న బట్టలు చిందరవందరగా ఉండడం చూసింది. వెంటనే తండ్రికి తెలియజేయడంతో ఆయన వచ్చి పరిశీలించగా.. 40గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.1.40లక్షలు విలువైన వెండిని చోరీ చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ విష్ణునారాయణ సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఈ పాప సంబంధీకులు ఉంటే... సంప్రదించండి

● జిల్లా బాలల పరిరక్షణ అధికారి



కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): 15 నెలలు వయసు గల ఆడపాపను గుర్తు తెలియని వ్యక్తులు ఈ నెల 17వతేదీ ఆర్టీసీ బస్టాండులో వదిలిపెట్టి వెళ్లినట్లు జిల్లా బాలల పరిరక్షణ అధికారి డీఆర్ సుభాష్‌యాదవ్ తెలిపారు. ఈ విషయం తెలిసి కారుణ్య ఫౌండేషన్ వారు ఆ పాపను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. విషయం తెలుసు కున్న జిల్లా బాలల పరిరక్షణ విభా గం ఐసీడీఎస్ అధికా రులు కారుణ్య ఫౌండేషన్ నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆ పాప ప్రత్యేక దత్తత సంస్థలో ఆశ్ర యం పొందుతోంది. ఎవరైనా ఆ పాప తల్లిదండ్రులు కానీ రక్తసంబంధీకులు కానీ తగిన ఆధారాలతో సంప్రదించాలని ఆయన తెలిపారు.

శ్రీశైలం బస్సు రాకకోసం..

● బస్టాండ్‌లో ప్రయాణీకుల పడిగాపులు
● రెండు గంటలు ఆలస్యంగా బయలుదేరిన బస్సు

కడప మారుతీనగర్, నవంబరు 21 (మారుతీనగర్): కడప డిపో నుంచి శ్రీశైలం బయలుదేరాల్సిన ఆర్టీసీ బస్సు ఆలస్యంగా బస్టాండ్‌కు చేరుకోవడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం 1-30 గంటలకు బయలుదేరాల్సిన బస్సు 3-30 గంటలకు (దాదాపు 2 గంటలు ఆలస్యంగా) బస్టాండుకు చేరుకోవడంతో ప్రయాణీకులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. కడప డిపో నుంచి శ్రీశైలానికి ప్రతిరోజూ రెండు బస్సులు తిప్పుతున్నారు. అందులో ఒక బస్సు తెల్లవారు జామున 5 గంటలకు, మరో బస్సు మధ్యాహ్నం 1-30కి శ్రీశైలానికి కడప డిపో నుంచి బయలు దేరుతాయి. అయితే శుక్రవారం కడప డిపో నుంచి మధ్యాహ్నం 1-30కు బయలు దేరాల్సిన ఏపీ04జెడ్-0305 నెంబర్ గల ఎక్స్‌ప్రెస్ బస్సు డిపో నుంచి బస్టాండుకు రాలేదు. బస్సు ఎంత సేపటికీ బస్టాండ్‌కు చేరుకోకపోవడంతో ప్రయాణీకులు ఎంక్వయిరీ (విచారణకేంద్రం) దగ్గరకెళ్లి ఆరా తీశారు. అయితే వారికి సరైన సమాధానం రాలేదు. దీంతో బస్సు కోసం వేచి ఉన్న దాదాపు 40 మంది ప్రయాణీకులలో సగం మంది ఇంటికెళ్లిపోయారు. చివరకు మధ్యాహ్నం 3-30కి గ్యారేజీ నుంచి బస్సు బస్టాండ్‌కు చేరుకుంది. దీంతో మిగిలిన 24 మందితో ఆ బస్సు శ్రీశైలానికి బయలుదేరింది. ఈ సందర్భంగా ప్రయాణికులు ఆర్టీసి అధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డారు. కాగా బస్సు స్ప్రింగ్ ప్లేట్స్ కట్ కావడంతో గ్యారేజీలో మరమ్మతులు చేసినట్లు తెలుస్తోంది. ఈ కారణంగా బస్సు ఆలస్యంగా బస్టాండ్‌కు వచ్చినట్లు సమాచారం.



శ్రీశైలం బస్సు రాక కోసం కడప డిపోలో వేచివున్న ప్రయాణికులు

కంటి తుడుపు చర్యలేనా..?



తాత్కాలిక నిర్మాణాలు తొలగించడమేనా.. ● అభివృద్ధి పనులు చేసేదేమన్నా ఉందా ఎంత కాలం ప్రజలకు ఎదురు చూపులు

చెన్నూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : హైవేలో అభివృద్ధి పనులు అటకెక్కినట్లయింది. అసలు ఎప్పుడు చేపడతారో, చేస్తారో లేదో తెలియని పరిస్థితి ఏర్పడింది. నెల రెండు నెలలు కాదు, ఏడాది, రెండేళ్లు కాదు.. దాదాపు పదేళ్లు గడుస్తోంది. అయినా అభివృద్ధి ఊసే లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో ఇటీవల హైవే లో విస్తరణ పనులు చేపడుతున్నట్లు వదంతి బలంగా వచ్చింది. అందుకు తగినట్లుగా రహదారికి ఇరువైపులా ఉన్న తాత్కాలిక నిర్మాణాలన్నీ తొలగించారు. దీంతో ప్రజలు అభివృద్ధి పనులపై పెట్టుకున్న ఆశలు కాస్త చిగురించాయి. పనులు చేస్తున్నారంటూ ఆనందించారు. అయితే తాత్కాలిక నిర్మాణాలు తొలగించినప్పుడు పనులు చేసేందుకు నిధులు మంజూరయ్యాయా లేదా అన్న సందేహాలు ప్రజలకు వచ్చాయి. ఒక వేళ పనులు చేపడితే ఏమేం పనులు చేస్తారు. ఎంత కాలం పడుతుంది అంటూ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే దాదాపు పదిమార్లు అధికారులు చెన్నూరు రావడం, హైవేని చూడడం, మండల ప్రజాప్రతినిధులు, ప్రజలతో మాట్లాడడం జరిగింది. వచ్చిన ప్రతి సారీ అధికారులను స్థానిక నేతలు మీరు పనులు ఎప్పుడు చేపడతారు, ఎంత టైం పడుతుంది అని అడిగినప్పుడల్లా ఈ ఏడాది లోపే జరుగుతుందని పదేళ్లకాలం గడిపే శారు. పైగా గట్టిగా నిలదీసి అడిగితే ఉన్నతాధికారులకు నివేదిక పంపాం త్వరలో నిధులు వస్తాయి, పనులు తప్పక చేపడతామని చెప్పడం ఈ సమస్యలు తొలగి అభివృద్ధి పనులు చాల బాగా జరుగుతాయనడం జరిగింది. అయితే అవన్నీ నీటి మూటలయ్యాయి. గతవారం రోజులు గా చెన్నూరు రహదారికి ఇరువైపులా ఉన్న తాత్కాలిక నిర్మాణాలు తొలగించడంతో ఇక అభివృద్ధి పనులు జరుగుతాయని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. మరి ఈ ఆశలు ఎప్పటికి తీరుతాయో, ఇవన్నీ కంటి తుడుపు చర్యలేనా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. కాగా హవే అధికారులు మాటలతోనే సరిపుచ్చుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చెన్నూరు వద్ద హైవేలో తొలగించిన తాత్కాలిక నిర్మాణాలు

బతుకుదెరువులు పోయాయి..: హైవేలో బతుకుదెరువు కోసం రోడ్డుకు ఇరువైపులా స్థానికులే చిన్న చిన్న తోపుడుబండ్లు, పూల అంగళ్లు, వడలు, బజ్జీలు, టీ, పానీపూరీ అమ్ముకునే వారు రోడ్డుపక్కన పెట్టుకుని అమ్ముకునేవారు ఇలా ఎంతో మంది కుటుంబ పోషణ కోసం చిరువ్యాపారాలు చేసుకునేవారు. ఈ హైవే సిబ్బంది మాత్రం ఏడాదికి రెండు మూడుమార్లు అభివృద్ధి పనులు చేస్తామని కొలతలు వేసి మార్కింగ్ ఇచ్చి చిరువ్యాపారులను మీరు ఇక్కడ ఉండవద్దు,మేంపనులు చేపడతాం, మీరు ఎక్కడికైనా వెళ్లండని పంపించడం జరిగేది. తాత్కాలికంగా వేసుకునే నిర్మాణాలు తొలగించే వారు. అయితే ఆ తరువాత అభివృద్ధి పనులు చేసేదే ఉండదు, రోడ్డును నమ్ముకుని బతికే చిరువ్యాపారులు ఈ హైవే సిబ్బంది పుణ్యమా అంటూ ఇబ్బందులు పడే పరిస్థితి వచ్చింది.

పంచాయతీ పరంగా చేస్తామన్నా ఒప్పుకోవడం లేదు



పంచాయతీ ద్వారా రోడ్డు వేయిస్తామన్నా, బస్‌షెల్టరు కట్టిస్తామన్నా ఈ హైవే వారు ఒప్పుకోవడంలేదు. దీంతో ప్రజలు ఎంత ఇబ్బందులు పడుతున్నారో ఒక ప్రజాప్రతినిధిగా నాకు అంతా తెలుసు. చిత్తూరు నుంచి కర్నూలు వరకు ప్రతి ఊరిలో బైపాస్ రోడ్లు, సర్వీసు రోడ్లు, బస్ షెల్టర్లు, లైట్లు వేశారు. మా ఊరి ఖర్మ ఏమో, ఇక్కడ మాత్రం ఏ పనులు చేయలేదు. పైగా టోల్‌ప్లాజా కట్టి ఇష్టానుసారంగా కోట్లు సంపాదించారు. అభివృద్ధి పనుల వరకు వచ్చేసరికి తప్పించుకుని పోతున్నారు. ఇప్పుడు తొలగించిన తాత్కాలిక నిర్మాణాల స్థలంలో పైపలైను వేస్తారా, రోడ్లు వేస్తారా ఏదొకటి తేల్చడంలేదు. ప్రజలకు సరిగా చెప్పడం లేదు. రోజూ మమ్మల్ని ప్రజలు అడిగితే వారికి ఏం సమాధానం చెప్పాలో అర్థం కావడంలేదు.

- ఎస్.వెంకటసుబ్బయ్య, సర్పంచ్, చెన్నూరు

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న పుత్తా కుటుంబసభ్యులు

వల్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లె గ్రామంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి స్వగృహంలో శుక్రవారం కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవం ఎమ్మెల్యే క్రిష్ణ చైతన్యరెడ్డి దంపతులు, పుత్తా నరసింహారెడ్డి దంపతులు ఆధ్వర్యంలో నిర్వహించారు. పుత్తానరసింహారెడ్డి కుమార్తె, అల్లుడు, సోదరుడు రామచంద్రారెడ్డి దంపతులు, యువ నాయకుడు పుత్తాలక్ష్మీరెడ్డి ఈ కల్యాణ ఉత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు ,అన్నప్రసాద పంపిణీ కార్యక్రమాలు చేపట్టారు.

నగర టీడీపీ అధ్యక్షుడు మన్సూర్ అలీఖాన్‌కు సన్మానం



మన్సూర్ అలీఖాన్‌ను సత్కరిస్తున్న మాసాపేట శివ, శంకర్

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కడప నగరం 26వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి చవలముడి శంకర్ ఆధ్వర్యంలో నూతన నగర అధ్యక్షుడిగా నియమితులైన మన్సూర్ అలీఖాన్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, 26వ డివిజన్ ప్రెసిడెంట్ మౌనిక, ప్రతాప్, ఎన్నారై రహమతుల్లా, కొమ్మలపాటి సుబ్బరాయుడు, ప్రతాప్, అనిల్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

కడప సెవెన్ రోడ్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల తరబడి పేదల కాలనీలు సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాల్వల నిర్మాణానికి కూడా నోచుకోక పోవడం దారుణమని సీపీఐ నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ పేర్కొన్నారు. ఈస్ట్ జోన్ పరిధిలోని స్థానిక సమస్యలను పరిష్కరించాలని ఈనెల 24వ తేదీన కడప మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. శుక్రవారం కడపనగర ఈస్ట్‌జోన్ పరిధిలోని 2వ డివిజన్‌లో ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి నగర్‌లో స్థానిక సమస్యలపై సీపీఐ సమరభేరి కార్యక్రమంలో భాగంగా ప్రజా సమస్యలను పరిశీలించారు.

దోమకాటుతో ప్రాణాంతకవ్యాధులు

జిల్లా మలేరియా అధికారి మనోరమ

పులివెందుల రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దోమకాటుతో ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతాయని జిల్లా మలేరియా అధికారి మనోరమ ప్రజలకు సూచించారు. శుక్రవారం తొండూరు మండలంలోని అగడూరు గ్రామంలో జరుగుతున్న ఫ్రైడే డ్రైడే, వైద్యశిబిరం కార్యక్రమాన్ని ఆమె సందర్శించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయాలి



పోలీస్ పరేడ్‌లో పాల్గొన్న డీఎస్పీ మురళీనాయక్

వేంపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పట్ల బాధ్యతగా పనిచేయాలని పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ పోలీసు సిబ్బందికి సూచించారు. వేంపల్లె, ఆర్కేవ్యాలీ స్టేషన్‌లకు సంబంధించి పోలీసు సిబ్బంది శుక్రవారం స్థానిక జడ్పీ హైస్కూల్ ఆటస్థలంలో పరేడ్ నిర్వహించారు. విధి నిర్వహణలో ఒక భాగంగా వ్యాయామం చేయాలని తెలిపారు.

కొనసాగుతున్న డ్రోన్ నిఘా



కడప క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గంజాయి, అసాంఘిక కార్యకలాపాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం తాగే వారిపై కఠిన చర్యలకు పోలీసు అధికారులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. శుక్రవారం వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో గంజాయి, బహిరంగ మద్యపానం చేసే అవకాశాలు ఉన్న ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా చర్యలు చేపట్టారు.వన్‌టౌన్ సీఐ చిన్నపెద్దయ్య ఆధ్వర్యంలో, స్పెషల్ పార్టీ సిబ్బంది కలిసి ఆయా ప్రాంతాలను జల్లెడ పట్టారు. నగరంలోని బుగ్గవంక పరివాహక ప్రాంతం, గుర్రాలగడ్డ, పాతబస్టాండు ఓల్డ్ రిమ్స్ పరిసరాల్లో, పాత భవనాలు, ఇళ్లు ఉన్న ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచడం జరిగింది.

ఘనంగా పోలి పాడ్యమి పూజలు

పెన్నానదికి మహిళల దీపహారతి



చెన్నూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం పూర్తి అయినసందర్భంగా మార్గశిర మాసం మొదటిరోజు అయిన శుక్రవారం పాడ్యమి సందర్భంగా తెల్లవారుజామునే మహిళలు మల్లేశ్వరుడికి విశేష పూజలు చేసి పక్కనే ఉన్న పెన్నానదిలో ఆ నదికి దీప హారతి ఇచ్చి దీపాలు వదిలారు. నెలరోజుల పాటు మహాదేవునికి కార్తీక జ్యోతులతో హారతులు ఇచ్చి పూజలు నిర్వహించిన ప్రజలు మాసం పూర్తయిన సందర్భంగా తెల్లవారుజామున 3 నుంచే విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అధిక సంఖ్యలో వచ్చిన మహిళలు దీపాలు తీసుకెళ్లి పెన్నానదిలో వదిలి నమస్కరించారు.

నిధులు కేటాయించాలి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వవిద్యాలయం అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ కూన రవికుమార్‌ను ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు అరుణ్, చంద్ర, శివతేజ వినతిపత్రం ద్వారా కోరారు. విశ్వవిద్యాలయంలో కొనసాగుతున్న సమస్యలు, వివాదాలు, అవినీతి ఆరోపణలపై విచారణ వేగవంతం చేయాలని తెలిపారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. స్పందించిన రవికుమార్ ఈ విషయాలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, నిధుల కేటాయింపు, అక్రమాలపై విచారణకు సహకరిస్తామని హామీ ఇచ్చారు.

'ఆది'ని విమర్శించే స్థాయి లేదు

వేంపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిని విమర్శించేస్థాయి పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌కు లేదని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం ఎంత వరకు అయిన వెళ్లే నాయకుడు ఆదినారాయణరెడ్డి అన్నారు. వైసీపీకి ఒకవైపు వెన్నుపోటు పొడుస్తూ పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శించడం అందరికీ తెలుసన్నారు.

26న దేశవ్యాప్త నిరసన

కడప సెవెన్ రోడ్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎన్‌డీఏ ప్రభుత్వం తీసుకున్న అనేక ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలపై నవంబరు 26న దేశవ్యాప్త పిలుపులో భాగంగా కడప సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం తలపెట్టినట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి తెలిపారు.శుక్రవారం స్థానిక హోచిమిన్ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులరెడ్డి, దస్తగిరిరెడ్డి,కేసీ బాదుల్లా మద్దిలేటి పాల్గొన్నారు.

మహిళా భద్రతపై అవగాహన

కడప క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో పోలీసు అధికారులు, సిబ్బంది శుక్రవారం మహిళా భద్రతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజంలో మహిళల భద్రత,పోక్సో చట్టం ప్రాముఖ్యత గురించి వివరించారు. సైబర్ మోసాలపై వివరించారు.

ఆడపిల్లల భద్రత మనందరి బాధ్యత

చెన్నూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆడపిల్లలను బాగా చదివించి వారి భవిష్యత్తుకు భరోసానిస్తూ మరింత జాగ్రత్తగా చూసుకోవాలని చెన్నూరు సీఐ క్రిష్ణారెడ్డి అన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆడపిల్లల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రత్నాదేవి, ఏఎస్ఐలు శంకరనాయక్, ఆంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై దృష్టి సారించండి

పులివెందుల టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై దృష్టిసారించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, పులివెందుల ఇన్‌చార్జి మనోహర్ సూచించారు. శుక్రవారం పులివెందుల సీపీఎం నాయకుడు గఫూర్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ పులివెందులలో కూటమి నాయకులు వైసీపీ నాయకులపై, వైసీపీ నాయకులు కూటమినాయకులపై విమర్శలు చేసుకోవడం సమంజసం కాదన్నారు. ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటిని పరిష్కరించేందుకు నాయకులు పోటీ పడాలన్నారు.

'అవినాశ్ పేరుకే సౌమ్యుడు'



మాట్లాడుతున్న శశిభూషణ్‌రెడ్డి

పులివెందుల రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి పేరుకే సౌమ్యుడు అని ఆయన ఆలోచనలన్నీ అత్యంత క్రూరత్వమైనవని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగల శశిభూషణ్‌రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం పులివెందులలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని ఎంపీ అవినాశ్ మాట్లాడుతున్నారన్నారు. ఎన్నికల్లో గెలిచేందుకు సొంత బాబాయ్‌ని గొడ్డలి వేటు వేసిన వారికి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. అలాగే జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి గురించి ఎంపీ అవినాశ్ చేసిన వ్యాఖ్యలు విడ్డూరమన్నారు.మరింత దారుణం ఏమిటంటే వారి కార్యకర్తల నుంచి కూడా 7శాతం కమీషన్ల రూపంలో తీసుకున్న నీచసంస్కృతి వైసీపీ నాయకులకే చెల్లుతుందన్నారు. ప్రజాస్వామ్యం లేదని ప్రజల్లోకి వచ్చి చెప్పే ధైర్యం వైసీపీ నాయకులకు లేదని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సాంస్కృతిక శాఖ కన్వీనర్ భానుప్రకాష్, అసెంబ్లీ కన్వీనర్ మహేశ్వర్‌రెడ్డి, పులివెందుల మండల అధ్యక్షుడు వై.నవీన్, రాజశేఖర్, ఉపేంద్ర, శ్రీరాములు పాల్గొన్నారు.

రాయితీపై క్రిమిసంహారక మందులు



రైతులకు క్రిమిసంహారక మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

లింగాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతుల కోసం ప్రభుత్వం 50శాతం రాయితీపై క్రిమిసంహారక మందులను పంపిణీచేస్తోందని జిల్లా రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ అశోక్‌రెడ్డి తెలిపారు. లింగాల, ఇప్పట్ల రైతు సేవా కేంద్రంలలో శుక్రవారం భూసార పరీక్ష ఫలితాలు, రాయితీ మందుల గురించి రైతులకు ఏవో రమేష్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలోసిబ్బంది రాణి, ప్రసన్న, పవన్, తేజ, రైతులు పాల్గొన్నారు.

సొసైటీలతో రైతులకు ఆర్థిక భరోసా : ఎమ్మెల్యే



సొసైటీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి

కమలాపురం రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సొసైటీల ద్వారా రైతులకు ఆర్థిక భరోసా కలిగుతుందని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణ చైతన్యరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చదిపిరాళ్ల గ్రామంలో చదిపిరాళ్ల సొసైటీ నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం శ్రీ అగస్తేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల ప్రతిభ



రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో అధికారులు

వేంపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు స్కూల్ గేమ్స్‌లో భాగంగా యోగా అండర్-17, 19 విభాగాల్లో ప్రతిభ కనబరిచారు. పది మంది పీయూసీ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని డైరెక్టర్ కుమారస్వామిగుప్త తెలిపారు. ఈనెల 23 నుంచి 25 వరకు బాపట్లలో జరిగే ఈ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఆ విద్యార్థులను అభినందించారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయండి : బీటెక్ రవి



రేషన్ డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న బీటెక్ రవి

పులివెందుల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో రేషన్‌డీలర్లు ప్రజలకు బియ్యం పంపిణీ సాగించడం లేదని విమర్శలు వస్తున్నాయని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని రేషన్‌డీలర్లతో బీటెక్ రవి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే పులివెందుల మున్సిపాలిటీ ఎన్నికలు రాబోతున్నాయన్నారు. పార్టీని అన్ని విధాలుగా సిద్ధం చేస్తున్నామన్నారు. ఈసారి మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించేలా ప్రయత్నిస్తున్నామన్నారు. కానీ రేషన్‌డీలర్లు సరుకులను ప్రజలకు సక్రమంగా పంపిణీ చేయడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇలా ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవన్నారు. ప్రజలకు ఎవరికి ఇబ్బంది లేకుండా పంపిణీ సాగించాలన్నారు. రెండు రోజులు పంపిణీని ఆపేస్తే కుదరదన్నారు. 1 నుంచి 15వ తేదీ వరకు క్రమం తప్పకుండా రేషన్ సరుకులు పంపిణీ చేయాలన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. అంతేతప్ప మీరే సమస్యలు తెచ్చే పరిస్థితి రానివ్వదని ఆయన హితవుపలికారు. అనంతరం టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. పలువురి సమస్యను సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో వేంపల్లె పరిశీలకుడు రఘునాథరెడ్డి తదితరులు ఉన్నారు.

ఇలా ఉంటే.. ప్రమాదం కాదా..?

- తక్కువ ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ తీగలు
- బస్సుపైభాగం తగిలేలా ప్రమాదకరంగా ఉన్నవైనం
- ప్రయాణంలో కట్టెతో వైర్లను తగలకుండా చేస్తున్న ప్రజలు
- భయాందోళనలో ప్రయాణికులు


విద్యుత్ తీగలు బస్సు వెళ్లే సమయంలో తగలకుండా కట్టెతో జాగ్రత్తలు తీసుకుంటున్న దృశ్యం

జమ్మలమడుగు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):ప్రమాదమని తెలిసినా గ్రామాలకు తప్పని ప్రయాణంలా ఆర్టీసీ బస్సుల పరిస్థితి నెలకొంది. జమ్మలమడుగు ఆర్టీసీ డిపో నుంచి ప్రతిరోజు మైలవరం మండలం బొగ్గులపల్లి గ్రామం వరకు బస్సు సర్వీసులు నడుస్తుంటాయి. కాగా జమ్మలమడుగు నుంచి మోరగుడి బైపాస్ రోడ్డు మీదుగా వేపరాల, మైలవరం, బొగ్గులపల్లె గ్రామానికి బస్సులు నడుస్తుండగా ఇటీవల రెండు నెలల నుంచి మైలవరం మండలంలోని వేపరాల, దొమ్మరనంద్యాల, మోరగుడి మీదుగా బస్సులు నడిపేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకున్నారు. అయితే గత కొన్ని రోజులుగా వేపరాల గ్రామంలో గాంధీ విగ్రహం దాటిన తర్వాత విద్యుత్తు తీగెలు తక్కువ ఎత్తులో వేలాడుతూ బస్సు పైభాగం తాకేలా ఉండడంతో స్థానికులు కట్టెతో విద్యుత్ వైర్లను బస్సుకు తగలకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఆర్టీసీ బస్సు గానీ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలలు తదితర బస్సు సర్వీసులు ఆదారిలో విద్యుత్తు తీగెలు తగిలి ఏదైనా ప్రమాదం జరిగితే ఊహించడానికే భయమేస్తుంది. తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా మారిన విద్యుత్ తీగలను సంబంధిత విద్యుత్ శాఖా అధికారులు చక్కదిద్ది భవిష్యత్‌లో ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులతోపాటు ప్రజలు కోరుతున్నారు.

వెంకటాద్రి, దాదర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ ఇవ్వాలి

కొండాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కొండాపురం రైల్వేస్టేషన్‌లో వెంకటాద్రి, దాదర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ ఇవ్వాలని స్థానిక ప్రజలు శుక్రవారం స్టేషన్‌మాస్టర్ గురుప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా ముందు కొండాపురం రైల్వేస్టేషన్ మీదుగా వెళ్లే దాదాపు 80 శాతం రైళ్లు స్టేషన్‌లో ఆగేవని కరోనా తర్వాత ఎక్కువ రైళ్లకు స్టాపింగ్ ఎత్తివేశారన్నారు. రైల్వే అధికారుల పై ఒత్తిడి తేవడంతో, ఇటీవల నాలుగు రైళ్లు ఆపారని తెలిపారు. బ్రిటీష్ కాలం నుంచి కొండాపురం రైల్వేస్టేషన్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. అన్ని రైళ్లు ఆపకపోవడం వల్ల కొండాపురంతో పాటు చుట్టూ నాలుగు మండలాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్యక్రమంలో రైల్వేస్టేషన్ మెంబర్లు శ్రీరామిరెడ్డి, మనోహర్‌బాబు, సుబ్బారావు, నాగేశ్, వెంకటకృష్ణయ్య, లాజర్, కులశేఖర్ పాల్గొన్నారు.

బోధన, బోధనేతర సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

కలసపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బాగాంధీ బాలికల విదాయలయాలలో పనిచేస్తున్న స్పెషలాఫీసర్‌లు, సీఆర్‌టీలు, పీజీటీలు, బోధనేతర సిబ్బంది సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్‌టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేజీబీవీలలో ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న మినిమంటైం స్కేల్ వర్తింపు సమస్యను పరిష్కరించేందుకు ప్రస్తుత ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. ఇంటర్మీడియట్‌లో తెలుగు, ఇంగ్లీష్ సబ్జెక్టులను సీఆర్‌టీలనే బోధించమనడం సరికాదని, వార్డన్, నైట్‌వాచ్‌మెన్ పోస్టులను భర్తీ చేసి సీఆర్‌టీలను రాత్రి విధుల నుంచి తప్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉచిత వైద్య శిబిరం

మైదుకూరు నవంబరు21 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు ఎంఈఓ కార్యాలయ ఆవరణలో ఉన్న భవిత కేంద్రంలో శుక్రవారం నియోజక వర్గ స్థాయిలో 3 నుంచి 18 సంవత్సరాల వయస్సు ఉన్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి 120 మంది హాజరుకాగా అర్హత ఉన్న 80 మందిని ఎంపిక చేసి వారికి అవసరమయ్యే యంత్రాలు అందించడానికి కొలతలు తీసుకున్నారు. సహిత విద్య కోఆర్డినేటర్ రమణమూర్తి,ఎంఈఓలు పద్మలత, నరహరిశర్మ, సహిత విద్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలకవర్గాన్ని నియమించాలి

పోరుమామిళ్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ముదిరాజ్ సామాజిక వర్గ సంక్షేమం కోసం ముదిరాజ్ కార్పొరేషన్‌కు పాలకవర్గం నియమించాలని ముదిరాజ్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నాగేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ అత్యంత వెనుకబడ్డ ముదిరాజ్ సామాజిక వర్గం సంక్షేమాభివృద్ధి కోసం ప్రభుత్వం ఆదరణ3 పథకం ద్వారా ముదిరాజ్‌లకు ఆధునిక పనిముట్లు అందించాలన్నారు.

శానిటేషన్ వర్కర్లకు రేడియం జాకెట్లు పంపిణీ

మైదుకూరు నవంబరు21(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో విదులు నిర్వహిస్తున్న 61 మంది పారిశుధ్య కార్మికులకు శుక్రవారం మున్సిపల్ అధికారులు రేడియం జాకెట్లను అందించారు. విదినిర్వహణలో ప్రమాదాల బారిన పడకుండా ఎంఎల్ఏ ఆదేశాలతో ప్రతి ఒక్కరికీ రెండు జతల రేడియం జాకెట్లను ఇవ్వడంతో ఎంఎల్ఏకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇష్టపడి, కష్టపడి ఉన్నతస్థానంలో నిలవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

జమ్మలమడుగు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు ఇష్టపడి, కష్టపడి చదివి ఉన్నత స్థానంలో నిలవాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో స్వర్ణాంధ్ర-2047 జమ్మలమడుగు నియోజకవర్గ విజన్ యాక్షన్‌ప్లాన్ కార్యాలయాన్ని ప్రజాదర్బార్ (పీజీఆర్‌ఎస్)ను ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, ఆర్డీవో సాయిశ్రీ ప్రారంభించారు. సమావేశంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం నియోజకవర్గంలోని ఆరు మండలాల ప్రజలు మండల కేంద్రాలు, అధికారుల వద సమస్యలు పరిష్కారం కాకుంటే పీజీఆర్‌ఎస్ కార్యాలయంలో వినతి పత్రాలు సమర్పించాలన్నారు.

మెగా జాబ్‌మేళా: జమ్మలమడుగు మున్సిపల్ కార్యాలయం సమీపంలో శుక్రవారం న్యాక్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు 68 మంది హాజరయ్యారు. టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో మరిన్ని ఫ్యాక్టరీలు రాబోతున్నాయని తద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటరామిరెడ్డి, ఎంపీడీవో సైదున్నీసా, మార్కెట్‌యార్డు ఛైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, డీఎల్‌డీవో రామాంజనేయులు, టీడీపీ నాయకులు బేపారి మహమ్మద్ రఫి, బిద్రు సంతోష్, వంగల నాగేంద్రయాదవ్, పొన్నతోట శ్రీను పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి సంతాపం

అట్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అట్లూరు మండలంలోని కోనరాజుపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు వెంకటసుబ్బయ్య మృతి పట్ల శుక్రవారం డీసీసీ బ్యాంకు ఛైర్మన్ మంచూరి సూర్యనారాయణరెడ్డి సంతాపం తెలిపారు, వెంకటసుబ్బయ్య పార్థిక దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి అనంతరం మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు అరవ శ్రీనివాసులరెడ్డి, మండల ఇన్‌ఛార్జ్ రెడ్డయ్య, టీడీపీ నాయకులు పుల్లారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లింగవివక్షను నిర్మూలన చేయాలి

జమ్మలమడుగు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): లింగ వివక్ష నిర్మూలనకు కృషి చేయాలని డీఆర్‌డీఏ ఏపీడీ వరప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం జమ్మలమడుగు పట్టణంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో 16 మండలాలకు సంబంధించి జండర్ కార్యక్రమాలపై అవగాహన, శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. పులివెందుల, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు మండలాల ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

మైదుకూరు రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నలూరు గ్రామంలో శుక్రవారం తిరుపతి వెంకటేశ్వర వ్యవసాయ కళాశాలకు హాండ్స్‌అగ్రికల్చర్ విద్యార్థులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో అన్నలూరు, పరిసర ప్రాంతప్రజలు పాల్గొని వైద్య సేవలను ఉచి తంగా పొందారని జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జ్యోత్న తెలిపారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్టు ఎంపిక

ప్రొద్దుటూరు , నవంబరు 21 (ఆంధ్ర జ్యోతి) : ప్రొద్దుటూరు ఎద్దుల వెంకట సుబ్బమ్మ మున్సిపల్ బాలికల ఉన్నతపాఠశాల కు చెందిన 9 వతరగతి విద్యార్థినిలు కే సాయి కీర్తన , ప్రణవిలు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్ భాస్కర్ తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటి కృష్ణా జిల్లా మచిలీపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వెల్లడించారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

కొండాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి చెక్కులను శుక్రవారం మండలంలోని చౌటిపల్లె గ్రామంలో పంపిణీ చేశారు. జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి సిఫారసుతో గ్రామంలోని మాణిక్యంరాజు అనే వ్యక్తికి రూ.51,081, వెల్లాల శివమ్మ అనే మహిళకు రూ.21054, వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను మాజీ సర్పంచ్ రామలింగేశ్వరరెడ్డి పంపిణీచేశారు. ఈ సందర్భంగా ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత తప్పక పాటించాలి


మోరగుడిలో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న ఎంపీడీవో సైదున్నీసా, డీఎల్‌డీవో

జమ్మలమడుగు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత తప్పక పాటించాలని అధికారులు సూచించారు. మండలంలోని మోరగుడి మేజర్ పంచాయతీ లోని మూడు రోడ్ల కూడలి వద్ద నుంచి రోడ్లకు ఇరువైపుల డ్రైనేజీకాలువల్లో వ్యర్థాలు తొలగించడం, కంపచెట్లు, వ్యర్థాలు శుభ్రం చేయడం చేపట్టారు. , డీఎల్‌డీవో రామాంజనేయులు, ఎంపీడీవో సైదున్నీసా, సర్పంచ్ చౌడం జొల్లుకొండయ్య క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం సిబ్బందికి సూచనలు ఇచ్చారు. వ్యర్థాలను తొలగింపు కార్యక్రమం ఎక్స్‌కవేటర్ల ద్వారా తొలగించారు. కాలువ ఇరువైపుల ఆక్రమణలు జరిగాయని, వ్యర్థాలు తొలగించడానికి కొంత ఇబ్బందికరంగా ఉందని అక్కడున్న అధికారులు చెప్పారు. అయితే ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఇప్పటికైనా మోరగుడి గ్రామంలో ఆక్రమణకు గురైన ప్రాంతాల్లో చర్యలు తీసుకోవాలని అధికారులు సైతం పరిశీలించాలని కోరారు.సచివాలయ, పారిశుధ్య సిబ్బంది ఉన్నారు.

కలసపాడులో: మన పరిసరాలు శుభ్రంగా ఉన్నప్పుడే మనం ఆరోగ్యంగా ఉంటామని డీఎల్‌పీఓ వెంకటశేషయ్య, ఎంపీడీఓ మహబూబ్‌బీలు ప్రజలకు తెలియపరిచారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగశుక్రవారం మండల పరిధిలోని మహానందిపల్లెలో క్లీన్ అండ్ గ్రీన్ ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని 23 మంది హరితరాయబారుల వీధులను శుభ్రం చేసి, పిచ్చిమొక్కలను తొలగించి వివిధ రకాల మొక్కలను నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ మురళీమోహన్, పరిపాలనాధికారి సీతారామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు సచివాలయం సిబ్బంది, గ్రామనాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

దువ్వూరులో: దువ్వూరు మండలం గుడిపాడు గ్రామంలో శుక్రవారం పారిశుధ్య పనులపై స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. మండలంలోని పారిశుధ్య కార్మికులందరు ఇక్కడకు వచ్చి బ్యాచ్‌లుగా ఏర్పడి చెత్తాచెదారం తొలగించడంతోపాటు వీధులు కలియతిరిగి పరిశుభ్రత చేశారు. ఇక్కడి పనులను నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఆదిశేషారెడ్డి, మండల స్పెషల్ ఆఫీసరు హిదయతుల్లా పరిశీలించారు. ఎంపీడీవో సుబ్బారెడ్డి, తహసీల్దారు సంజీవరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో హరికృష్ణ, పంచాయతీరాజ్ ఏఈ సుబ్రమణ్యం, టీడీపీ మండల కన్వీనర్ వెంకట రమణారెడ్డి ఉన్నారు.

కాశినాయనలో: ప్రజలు ప్రభుత్వం పరస్పర సహకారంతో గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుటకు కృషిచేద్దామని ఎంపీడీవో మైథిలీ, ఈవోపీఆర్డీ ముజఫర్ రహీంమ్ పిలుపునిచ్చారు. థీమ్ 5 కింద ఎంపిక చేసిన సావిశెట్టిపల్లె గ్రామంలో స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ, మానవహారం నిర్వహించి తడి పొడి చెత్తను ఎలా వేరుచేయాలి వాటి ద్వారా ఎలా ఎరువులను తయారుచేయాలి తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండలంలోని గ్రామ పంచాయతీ సెక్రటరీలు,హరితరాయబారులు పాల్గొన్నారు.

ఖాజీపేటలో: ప్రతి ఒక్కరిలో చైతన్యం వచ్చి శుభ్రత పాటించగలిగితే గ్రామం పరిశుభ్రంగా ఉంటుందని ఎంపీడీవో దివిజాసంపతి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొత్తపేటలో గ్రామీణాభివృద్ధి సంస్థ చేపట్టిన సుస్థిరాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా గ్రామంలో అవగాహన కల్పించారు. గ్రామాన్ని శుభ్రత చేయించడంతోపాటు ముళ్లపొదలను తొలగించి తడి, పొడి చెత్తలను చెత్త నుంచి ఎరువు తయారు చేయుకేంద్రానికి తరలించడం జరిగిందన్నారు. కొత్తపేట గ్రామాన్ని ఆదర్శగ్రామం, పరిశుభ్రమైన గ్రామంగా తీర్చిదిద్దేలా ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలన్నారు.

మైదుకూరు రూరల్‌లో: పరసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో శ్రీధర్‌నాయుడు సూచనలిచ్చారు. మండలంలోని గంజికుంట పంచాయతీలో పరిశుభ్రత.. పచ్చదనంపై గ్రీన్ అంబాసిడర్లకు, గ్రీన్‌గార్డులకు ఒక రోజు శిక్షణ శుక్రవారం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆధ్వర్యంలో 7 గ్రామాలలో ప్రజలకు పచ్చదనం,పరిశుభ్రత గురించి ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు.

అట్లూరులో : కుంభగిరి పంచాయతీలో శుక్రవారం ఎంపీడీవో వెంగమునిరెడ్డి ఏడు సచివాలయాల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం గ్రామాల్లోని వీధుల్లో ఉన్న మురుగునీటిని శుభ్రం చేసినట్లు తెలిపారు.

బి.కోడూరులో : మండల పరిధిలోని బి.కోడూరు గ్రామ పంచాయతీలో ఎంపీడీవో భాస్కర్‌రావు ఆ ధ్వర్యంలో క్లీన్ ఆంధ్ర.. క్లీన్ విలేజ్‌లో భాగంగా స్పెషల్‌క్యాంపెయిన్ నిర్వహించారు. బికోడూరు గ్రామ పంచాయతీలో పది చోట్ల పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో సొసైటీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ జాన్‌కెన్నడి, స్థానిక సర్పంచ్ మునిరెడ్డి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

మైలవరంలో: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీడీవో సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని వేపరాల గ్రామంలో పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ తడి, పొడిచెత్తలను వేరువేరుగా సేకరించాలన్నారు. ఇంటి పరిసరాలను ప్రతి ఒక్కరు పరిశుభ్రంగా ఉంచుకొనేటట్లు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

పాత సామగ్రి సేకరించే వారిని గుర్తించండి

ప్రొద్దుటూరు , నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పాత సామగ్రి సేకరించేవారిని గుర్తించాలని అసిస్టెంట్ కమిషనర్ కొండయ్య మెప్మా సిబ్బందికి తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మెప్మా సీవోలు ఆర్‌పీలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కొండయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నమస్తే ప్రొగ్రాంలో ప్రొఫైల్ అప్‌డెట్ చేయవలసిన భాధ్యత మనఅందరిపై ఉందన్నారు. ఎలాంటి గుర్తింపునకు నోచుకోని పాత వస్తువలను సేకరించి అమ్ముతున్న వ్యక్తుల కోసం కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం రూపొందించిందన్నారు. వారికి గుర్తింపు కార్డులతో పాటు పీపీఈ కిట్లు , హెల్త్ ఇన్సూరెన్సు వారి పిల్లల చదువులు ఏర్పాటు చేయాలన్నారు. మెప్మా టీఈ మహాలక్ష్మీ, శానిటరీ సూపర్ వైజర్ నూర్ బాషా, , జిల్లా కోఆర్డినేటర్ ఈశ్వరయ్యలు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో కాలువ, రోడ్డు నిర్మాణ పనులు


మైదుకూరు రోడ్డులో తాత్కాలికంగా వేస్తున్న బీటీ రోడ్డు

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపల్లి పంచాయతీ టీచర్స్ కాలనీలో కాలువ నిర్మాణ పనులను చేపట్టారు. శుక్రవారం సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి రూ.7 లక్షల వ్యయంతో ఈ కాలనీలో ఇరువైపుల 200 మీటర్ల మేర నూతన కాలువ నిర్మాణ పనులను ప్రారంభించారు. అలాగే ప్రొద్దుటూరు-మైదుకూరు రోడ్డులలో 250 మీటర్ల మేర తాత్కాలిక బీటీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం తాత్కాలిక రోడ్డు పనులను చేపట్టామని, త్వరలో కోటి రూపాయల వ్యయంతో ఆర్టీసీ బస్టాండు నుంచి హనుమాన్ జంక్షన్ వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే పుట్టా జన్మదిన వేడుకలు

- 61 కేజీల కేకుతో అభిమానం చాటుకున్న టమోటా మర్చంట్


వేడుకలలో పాల్గొన్న టీడీపీ నాయకులు

మైదుకూరు నవంబరు21(ఆంధ్రజ్యోతి): మైదుకూరు శాసనసభ్యుడు పుట్టా పుదాకర్ యాదవ్ జన్మదిన వేడుకలను మైదుకూరు మున్సిపాలిటీ వ్యాప్తంగా శుక్రవారం టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో పట్టణాధ్యక్షుడు దాసరి బాబు అలాగే మార్కెట్‌యార్డులో ఛైర్మన్ ఏపీ రవీంద్రల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఒకటవ వార్డు కేశలింగాయపల్లిలో టీడీపీ నాయకుడు, టమోటా మర్చంట్ పసల పోతులూరు ఆధ్వర్యంలో స్థానిక గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఎంఎల్ఏ 62వ పుట్టినరోజు సందర్భంగా 61 కేజీల కేకును కోసి అభిమానాన్ని చాటుకున్నారు. ఈ వేడుకలకు హాజరైన పుట్టా పుదాకర్ యాదవ్ సోదరుడు పుట్టా ప్రభాకర్ యాదవ్, నాయకులు మిల్లు శ్రీను,దాసరిబాబు, ధనపాల జగన్, ఏపీ రవీంద్రలు పోతులూరును అభినందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ పుట్టా పుదాకర్ యాదవ్ రాబోయే రోజులలో ఉన్నత మరిన్న ఉన్నత పదవులు పొందాలని వారు ఆకాంక్షించారు. అనంతరం గ్రామంలో అల్పాహార విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాశం మారుతి, గుండంరాజుసుబ్బయ్య, ధనపాల రవి,పసల సంటెయ్య పెద్ద ఎత్తున యువకులు పాల్గొన్నారు.

చాపాడులో వృద్ధులకు పండ్లు పంపిణీ


వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ శ్రీవాణి

చాపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లవోలు గ్రామం వద్ద ఉన్న కాశిరెడ్డినాయన వృద్ధాశ్రమంలో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పుట్టినరోజు సందర్భంగా టీడీపీ నాయకులు వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. మైదుకూరు మార్కెట్‌యార్డు వైస్‌ఛైర్మన్ నాయబ్‌రసూల్, సుదర్శన్‌యాదవ్, లక్ష్మినారాయణ, నాగరాజు వృద్ధులకు డాక్టర్ శ్రీవాణి చేతుల మీదుగా పండ్లు పంపిణీ చేశారు.

ఖాజీపేటలో: మండల పరిధిలోని సాయిబాబా ఆలయంలో మైదుకూరు శాసనసభ్యుడు పుట్టా సుధాకర్‌యాదవ్ జన్మదిన వేడుకలను పురష్కరించుకుని కేక్ కట్ చేసి ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గ్రంథాలయ డైరెక్టర్ లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ ప్రజలకోసం కష్టపడే వ్యక్తి మన ఎమ్మెల్యే పుట్టా అని ఇలాంటి వేడుకలు మరెన్నో జరుపుకోవాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నంద్యాల సుబ్బయ్య, సర్పంచు వెంకటసుబ్బయ్య, ఇండ్ల సుబ్బారెడ్డి, జానకీరాం, మామిళ్ల క్రిష్టారెడ్డి, పుల్లయ్య నాయుడు, ఆదినారాయణరెడ్డి, గోవిందు సుబ్బయ్య ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

దువ్వూరులో: దువ్వూరులో శుక్రవారం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక మూడు రోడ్ల కూడలిలో కార్యకర్తలు కేక్ కట్ చేసి అందరకి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్ మరిన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బోరెడ్డి వెంకటరమణారెడ్డి, నాయకులు పాపినేని రాంబాబు, కోనేటి హరినాథ్, వి.వెంకటరమణయ్య, పోలు రామమోహన్‌రెడ్డి, వెంకటసుబ్బయ్యనాయుడు, ఆశీర్వాదం, హయ్యద్, హుస్సేన్‌పీర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠంలో: మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ 61వ జన్మదిన వేడుకల సందర్భంగా శుక్రవారం బి.మఠం మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి,, మండల తెలుగు యువత నాయకుడు కాణాల మల్లిఖార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఐదు రోడ్ల కూడలిలో 25 కేజీల భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అలాగే ప్రజలకు, బ్రహ్మంగారి భక్తులు, యాత్రికులకు అన్నదాన కార్యక్రమాన్ని కాణాల మల్లి ఖార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సోమిరెడ్డిపల్లె సహకార సంఘం ఛైర్మన్ ఎల్లటూరు సాంబశివారెడ్డి, పూజా శివాయాదవ్, సూరి, సుధాకర్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు , పాల్గొన్నారు.


అన్నదానం నిర్వహిస్తున్న కాణాల మల్లిఖార్జునరెడ్డి

శ్మశాన వాటిక నిర్మాణ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

దువ్వూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం గుడిపాడు గ్రామంలోని శ్మశాన వాటిక నిర్మాణ పనులను నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఆదిశేషారెడ్డి శుక్రవారం పరిశీలించారు. వాటి పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. స్థల సేకరణ, వాటి వివరాల గురించి వాకబు చేశారు. పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అంతకుముందు దువ్వూరు హైస్కూలులో చేపట్టిన స్మార్ట్ కిచెన్ నిర్మాణ పనులతోపాటు టీచర్స్ కాలనీలోని పశువుల షెడ్డును పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో సుబ్బారెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ సుబ్రమణ్యం, ఏపీవో లక్ష్మినారాయణ, ఈసీ ఇందిరప్రియాంక పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని బలోపేతం చేయాలి

బ్రహ్మంగారిమఠం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయం బలోపేతానికి కృషి చేయాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టరు ఆదిశేషారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బ్రహ్మంగారిమఠం మండలంలోని నందిపల్లె గ్రామంలో సబల్ ప్రాజెక్టు ద్వారా అభివృద్ధి చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని చేపడుతున్న రైతన్నలతో డ్వాక్రా మహిళలతో ఆయన సమావేశమై మాట్లాడుతూ క్రిమిసంహారక మందులకు స్వస్తి పలికి ప్రకృతి ఎరువులతో పంటలను పండిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. కార్యక్ర మంలో సబల్ ప్రాజెక్టుప్రోగ్రాం కోఆర్డినేటరు శ్రావణి, క్లస్టరు కోఆర్డినేటరు మహేశ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఐసీఆర్‌పీలు, రైతన్నలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పెంపు ప్రతిపాదనలపై సమీక్ష


బూత్‌లెవెల్ సూపర్‌వైజర్లతో సమీక్షిస్తున్న తహసీల్దారు గంగయ్య

ప్రొద్దుటూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు నియోజకవర్గంలో పోలింగ్ బూత్‌లో 1200 ఓట్లు దాటితే రెండో బూత్ ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశా లమేరకు పోలింగ్ సూపర్ వైజర్లతో తహసీల్దారు గంగయ్య సమీక్షా సమావేశం నిర్వహించారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దార్ మాట్లాడుతూ ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ఇప్పుడు 268 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని వాటని బూత్‌కు 1200 ఓట్ల మేరకు విభజిస్తే మరో 42 పోలింగ్ బూత్‌లు పెరిగి మొత్తం 310 పోలింగ్ బూత్‌ల ఏర్పాటుకు జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాద నలు పంపనున్నట్లు తెలిపారు. ఈక్రమంలో చనిపోయిన వారి ఓట్లు తొలగించడం, ఇళ్లు మారిన వాళ్లవి మార్చడం, డబుల్ ఎంట్రీలు తొలగించే ప్రక్రియ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో రాజుపాళెం ఇన్‌చార్జ్ తహసీల్దారు మనోహర్ రెడ్డి, ఎల క్షన్ డిప్యూటి తహసీల్దారు అజయ్‌బాబు, వీఆర్‌వోలు, సీనియర్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రహీం ఎంపీడీవోగా పదోన్నతిపై కావలికి బదిలీ

కాశినాయన నవంబరు 21(ఆంధ్రజ్యోతి) మండలంలో డిప్యూటీ ఎంపీ డీవోగా పని చేస్తున్న ముజఫర్ రహీం ఎంపీడీవోగా పదోన్నతిపై నెల్లూరు జిల్లా కావలి మండలానికి బదిలీ అయినట్లు ఎంపీడీవో మైథిలీ తెలిపారు. ఆమేరకు శుక్రవారం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావ డంతో రిలీవ్ అయ్యి కావలిలో విధుల్లో చేరుటకు వెళ్లాడన్నారు.

ప్రజాసమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలి

రాజుపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని ఉప ఎంపీపీ నారాయణరెడ్డి సూచించారు. శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ సలోమి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు, రైతులకు సంక్షేమ దిశగా పనిచేసినప్పుడు అధికారులకు మంచి గుర్తింపు వస్తుందన్నారు. డిప్యూటీ ఎంపీడీవో షాకిర్ ఆలీఖాన్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు తెలిపిన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. గ్రామస్థాయి అధికారులు, ప్రజలకందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కారానికి పాటుపడాలన్నారు.